ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 29 జనవరి 2024



ఉత్సాహంలో యువత

అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా అభిశిక్త్ కిశోర్



నూతన కలెక్టర్ అభిశిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 28: అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా అభిశిక్త్ కిశోర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 21 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేశారు. ఈ బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లాకు అభిషిక్త్ కిశోర్‌ను బదిలీ చేసింది. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా ఉన్న ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను జాయింట్ కలెక్టర్‌గా కొనసాగాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. త్వరలో నూతన కలెక్టర్ బాధ్యతలు తీసుకోనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

మదనపల్లె ఆర్డీవోకు డిమోషన్

● ఆర్డీవో నుంచి తహసీల్దార్‌గా మురళి



రివర్షన్ పొందిన మురళి

రాయచోటి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఆర్డీవో ఎం.ఎస్.మురళికి తహసీల్దార్‌గా డిమోషన్ వచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలు ఆర్డీవోగా పనిచేస్తుండగా, సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు-344లో 66.25 ఎకరాల ఈనాం భూమిని ఫేర్‌ల్యాండ్ రిజిస్టర్ (ఎఫ్ఎల్ఆర్) ప్రకారం ఒంగోలు చారిటబుల్ సాధావర్తి మఠం ట్రస్టీస్ పేరు మీదున్న ఈ భూములను వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ 2013లో ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై అప్పటి ప్రకాశం జిల్లా కలెక్టర్ 2016లో జాయింట్ కలెక్టర్‌ను విచారణాధికారిగా నియమించారు. విచారణలో మఠం భూములను వ్యవసాయేతర భూమిగా మార్పు చేసినట్లు తేలింది. రెవెన్యూ (విజిలెన్స్-1) డిపార్ట్‌మెంట్ వారి ఉత్తర్వులు జీవోఆర్.టి.నెంబరు-46, తేదీ-17-1-24 ప్రకారం ప్రస్తుతం మదనపల్లె ఆర్డీవోగా పనిచేస్తున్న ఎం.ఎస్.మురళిని తహసీల్దార్‌గా రివర్షన్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై రెవెన్యూ మంత్రి వద్ద ఆర్డీవో మురళి అప్పీల్ చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇదిలా ఉండగా తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో దొంగఓటర్ ఐడీకార్డులు నమోదు కావడంపై కలెక్టర్ పీఎస్ గిరీషా సస్పెండ్ కాగా, తాజాగా అదే జిల్లాలో పనిచేస్తున్న మదనపల్లె ఆర్డీవోపై అక్రమాల పేరుతో చర్యలు తీసుకోవడం రెవెన్యూ అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భూవ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడిన కొందరు వీఆర్వో నుంచి తహసీల్దార్ వరకూ మరికొన్నిచోట్ల ప్రభుత్వం చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా మదనపల్లె డివిజన్‌లోని వివిధ మండలాల్లో అక్రమంగా ప్రభుత్వ భూముల్లో పట్టాలు జారీ చేయడం, మ్యుటేషన్లు చేయడం, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం, ఆక్రమణ అవుతున్నా పట్టించుకోకపోవడం సంఘటనలు అధికంగా ఉన్నాయి. మరోవైపు ప్రభుత్వ భూముల్లో రాజకీయ నాయకులు, రియల్టర్లు వెంచర్లు వేస్తుండగా, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్నారు. అలాగే విలువైన ప్రభుత్వ, ప్రైవేటు భూములను నిషేధిత జాబితా (22ఏ) నుంచి తొలగించి, ఎన్‌వోసీకి సిఫార్సు చేయడానికి రాజకీయ నాయకులు, దళారులు వీఆర్వో నుంచి జిల్లా అధికారుల వరకూ ప్రలోభాలు, ఒత్తిళ్లకు గురిచేస్తున్నట్లు అధికంగా ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ నాయకుల చట్రంలో పడిన అధికారులు ఇప్పటికైనా మేల్కోవాల్సి ఉందని, ఈ రెండు సంఘటనలు గుర్తు చేస్తున్నాయి.

● పీలేరు 'రా..కదలిరా' సభ సక్సెస్

● టీడీపీ, జనసేన శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం

● ఉబ్బితబ్బిబ్బవుతున్న నేతలు

వామ్మో... ఇంత జనమా...



పీలేరులో 'రా...కదలిరా' సభలో అశేష జనవాహిని నుద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు (ఫైల్)

పీలేరు, జనవరి 28: 'వామ్మో...ఇంత మంది జనమా? సాధారణ మీటింగ్‌లా ఉంటుందిలే అనుకుంటే నభూతో నభవిష్యత్తు అన్నట్లు జరిగింది. చంద్రబాబుని చూడడానికి, ఆయన చెప్పింది వినేదానికి అంత మంది రావడం అంటే మాటలు కాదు. అందులో వైసీపీవోళ్లు అపోసిషన్ వాళ్లను ఇబ్బందులు పెడుతూనే ఉన్నారు. అయినా భయపడకుండా జనం వచ్చారంటే ఆలోచించాల్సిందే. ఎక్కడ రాజంపేట, రైల్వేకోడూరు, ఎక్కడ పీలేరు. అంతంత దూరం నుంచీ కూడా జనం విపరీతంగా వచ్చారంటే టీడీపీ, జనసేన బలపడినట్లే.' ఇదీ ఆదివారం పీలేరులో ఏ ఇద్దరు కలిసినా వారి మధ్య జరిగిన చర్చ. పీలేరులో శనివారం జరిగిన చంద్రబాబునాయుడు 'రా...కదలిరా' సభకు పోటెత్తిన జనసునామీ గురించి శనివారం సాయంత్రం నుంచి చర్చలు ప్రారంభమయ్యాయి. ప్రత్యక్షంగా ఆ సభలో పాల్గొన్న వారు ఓవైపు, ఆ సభను టీవీలు, యూట్యూబ్‌లలో వీక్షించిన వారు మరోవైపు ఆదివారం సాయంత్రం వరకు దాని గురించే చర్చించుకుంటూ కనిపించారు. ఆ సభ సక్సెస్‌తో టీడీపీ శ్రేణులు కాలర్ ఎగరేసుకు తిరుగుతుంటే వైసీపీ వారు ప్రస్తుతానికి మౌనం వహిస్తున్నారు. సభలో చంద్రబాబు స్థానిక ప్రజాప్రతినిధుల అక్రమాలతో పాటు స్థానిక సమస్యలను ప్రస్తావించడం, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రకటించడం పట్ల స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

మరోమారు నిజమైన పీలేరు సెంటిమెంట్

పీలేరులో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే సక్సెస్ అవుతాయన్న సెంటిమెంట్ గత ఏడాది కాలంలో టీడీపీ శ్రేణుల్లో బలంగా నాటుకుపోయింది. పీలేరు ఇన్‌చార్జ్ నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిపై నమ్మకంతో పాటు గతంలో జరిగిన చంద్రబాబునాయుడు, నారా లోకేశ్‌ల పర్యటనలు అంచనాలకు మించి విజయవంతం కావడంతో పీలేరు సెంటిమెంటు నెలకొంది. ఆ సెంటిమెంటు కొనసాగింపులో భాగంగానే రాజంపేట పార్లమెంటు పరిధిలో పీలేరును ఎంచుకుని మరీ 'రా.కదలిరా' సభ ఏర్పాటు చేశారు. దానిని నిజం చేస్తూ శనివారం జరిగిన సభకు జనం పోటెత్తారు. రాజంపేట పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని పీలేరు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె, రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల నుంచి టీడీపీ శ్రేణులు, సామాన్య ప్రజలు చంద్రబాబు సభకు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. పీలేరుకు దగ్గరగా ఉన్న పుంగనూరు, మదనపల్లె, రాయచోటి నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వస్తారని ఊహించిన జిల్లా పార్టీ నేతల అంచనాలను తలకిందులు చేస్తూ పీలేరుకు ఎంతో దూరంగా ఉన్న రాజంపేట, రైల్వేకోడూరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి సైతం ప్రజలు పెద్దఎత్తున పాల్గొనడం అటు సామాన్య ప్రజలను, ఇటు పార్టీ వర్గాలను విస్మయానికి గురి చేసింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజులు జిల్లా లోని నాయకులను, కార్యకర్తలను సమన్వపరచి సభ విజయవంతానికి చేసిన కృషికి ఫలితం దక్కింది. సభ విజయవంతం కావడంతో చంద్రబాబు నల్లారి కిశోర్, జగన్ మోహన్‌రాజులను ప్రత్యేకంగా అభినందించారు. సభ భారీ విజయం కావడంతో జిల్లాలోని టీడీపీ నాయకులు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. పీలేరు-మదనపల్లె మార్గంలోని వేపులబైలు వద్ద జరిగిన సభకు చంద్రబాబు ప్రసంగం మొదలైన తరువాత కూడా జనం వచ్చారు. సభకు హాజరై తిరిగి వెళ్లేటప్పుడు పీలేరు-కలికిరి మార్గంలో కలికిరి వరకు, పీలేరు మార్గంలో అటు కడప, ఇటు తిరుపతి మార్గంలో పలుమార్లు పెద్దఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పీలేరు సభకు సుమారు లక్ష మందికి పైగా హాజరై ఉంటారని సామాన్య ప్రజలు, టీడీపీ శ్రేణులు చెబుతున్నారు.

సంతోషంలో నాయకులు

చంద్రబాబు సభ తమ అంచనాల కంటే మించి విజయం కావడంతో అన్నమయ్య జిల్లాలోని టీడీపీ నాయకులు సంతోషంలో మునిగితేలుతున్నారు. సభకు అధిక సంఖ్యలో యువత హాజరు కావడం, చంద్రబాబు ప్రసంగానికి వారు స్పందించడం, ఆయన వేసిన ప్రశ్నలకు జోరుగా సమాధానాలు చెప్పడం వారిలో ఉత్సాహాన్ని నింపాయి. చంద్రబాబు పట్ల నేటి యువతలో కూడా అభిమానం పెద్దఎత్తున ఉందని, అది తమకు అనుకూలిస్తుందని వారు అంచనాలు వేసుకుంటున్నారు. పీలేరు సభకు హాజరైన చంద్రబాబును చూడడానికి యువత ఉత్సాహం చూపారు. ఆయన ప్రసంగించేందుకు వేదిక మీదకు చేరుకోగానే సభ ప్రాంగణంలోని యువకులందరూ ఒక్కసారిగా ప్రధాన వేదిక వద్దకు చేరుకున్నారు. 'సీఎం...సీఎం' అంటూ నినాదాలు చేయడమే కాకుండా ఆయన మరింత దగ్గరగా చూసేందుకు బారికేడ్లను సైతం దాటుకుని ముందుకు వచ్చారు. వారి ఉత్సాహాన్ని ఆపలేక అటు పోలీసులు, ఇటు నాయకులు చేతులెత్తేశారు. చివరకు చంద్రబాబు కలుగజేసుకుని ప్రశాంతంగా ఉండాలని, ఉత్సాహాన్ని, ఆవేశాన్ని నియంత్రించుకుంటేనే మంచి ఫలితాలు వస్తాయని సర్దిజెప్పడంతో వారంతా చల్లబడి ఆయన ప్రసంగాన్ని ఆలకించారు. సభకు మహిళలు కూడా అధిక సంఖ్యలో హాజరు కావడం పట్ల టీడీపీ, జనసేన నాయకుల్లో భవిష్యత్తుపై మరింత భరోసా కల్పించింది. ఇదే స్ఫూర్తి కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడం సులువవుతుందని, ప్రజల్లో తమ పట్ల ఉన్న సానుకూల దృక్పథాన్ని ఓట్లుగా మలుచుకోవాలని వారు వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారు.

'యువగళం' పాదయాత్రకు ఏడాది పూర్తి

టీడీపీ యువనేత నారా లోకేశ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యువగళం పాదయాత్రకు శనివారం నాటికి ఏడాది పూర్తయ్యింది. పాదయాత్ర ప్రారంభమై ఏడాది కావడం, అదే రోజు పీలేరు సభలో చంద్రబాబు పాల్గొనడంతో అన్నమయ్య జిల్లా నాయకులు దానికి గుర్తుగా చంద్రబాబు ద్వారా కేక్ కట్ చేయించారు. యువగళం పాదయాత్ర ప్రారంభమైన నాటి నుంచి ముగిసేంత వరకు నారా లోకేశ్‌తో కలిసి నడిచిన టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మద్దిపట్ల సూర్యప్రకాశ్‌కు చంద్రబాబు కేక్ తినిపించి శుభాకంక్షలు తెలిపారు. గత ఏడాది జనవరి 27వ తేదీ కుప్పంలో ప్రారంభమైన యువగళం పాదయాత్ర అనేక అడ్డంకులు, ప్రతికూలతలు ఎదుర్కొని ముందుకు సాగిన విషయం తెలిసింది.



యువగళం పాదయాత్ర ప్రారంభమై ఏడాది అయిన సందర్భంగా పీలేరులో కేక్ కట్ చేస్తున్న చంద్రబాబు (ఫైల్)

సొంత గడ్డకు షర్మిల రాక

● ఉమ్మడి కడప జిల్లా కార్యకర్తలతో సమావేశం



కడప, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల సోమవారం కడపకు రానున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం తొలిసారి కాంగ్రెస్ పార్టీ చీఫ్ హోదాలో కడపకు వస్తున్నారు. స్తబ్ధుగా ఉన్న కాంగ్రెస్ సైన్యాన్ని సార్వత్రిక ఎన్నికలకు కార్యోన్ముఖులును చేసేందుకు షర్మిల ఉమ్మడి కడప జిల్లా స్థాయి సమావేశాన్ని కడప నగరం రింగు రోడ్డులో ఉన్న జయరాజ్‌గార్డెన్స్‌లో నిర్వహించనున్నారు. షర్మిలతో పాటు కాంగ్రెస్ రాష్ట్ర అగ్ర నేతలు పల్లంరాజు, రఘువీరారెడ్డి, రుద్రరాజు తదితర ముఖ్య నేతలు హాజరు కానున్నారు. షర్మిల ఆదివారం రాత్రి ఇడుపులపాయలో బస చేశారు. అనంతపురం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ముగించుకుని రోడ్డు మార్గం ద్వారా ప్రత్యేక బస్సులో రాత్రికి ఇడుపులపాయకు చేరుకున్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమేనా?

● ఎమ్మెల్యే శ్రీకాంత్‌కు మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి సవాల్



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి

రామాపురం, జనవరి28: భూఅక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి బహిరంగ చర్చకు సిద్ధమా అని టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆత్మను అని తాను చెప్పుకుంటూ అధికారులను భయభ్రాంతులకు గురి చేసి గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులను తన చెప్పుచేతల్లో పెట్టుకుని తీవ్ర భూఅక్రమాలకు, డాట్ ల్యాండ్ భూముల్లో కమీషన్లకు పాల్పడ్డారని, ఎమ్మెల్యే బహిరంగ చర్చకు సిద్ధమైతే తాను కూడా సిద్ధంగా ఉన్నానన్నారు. రాయచోటి చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములను బినామీల పేర్లతో కబ్జాలు చేసి రూ.కోట్లు కూడపెట్టిన ఘనత శ్రీకాంత్‌రెడ్డిదే అన్నారు. కలెక్టర్ కార్యాలయానికి కేటాయించిన ప్రభుత్వ భూమిని తన సమీప బంధువుల పేరుతో పక్క జిల్లాలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అధికారులపై ఒత్తిడి తెచ్చి రిజిస్టర్ చేయించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందన్నారు. దానిపై పత్రికల్లో రావడంతో తనకేమీ సంబంధం లేదని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై కేసు నమోదు చేస్తామని పెద్ద పెద్ద డైలాగులు చెప్పారని కంటి తుడుపు చర్యగా కేసు నమోదు చేయించి వారు కనీసం జైలుకు కూడా పోకుండా కాపాడిన వ్యక్తి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రూ.100 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఆయన బంధువు అయిన వైసీపీ కార్యకర్తకు తన ఇంటి పక్కన ఉండే దిన్నెపాడు గ్రామంలో బీసీ కులానికి చెందిన మహిళా సర్పంచ్‌ని పెట్టి బినామీ కబ్జాదారుడిని ఆ గ్రామ ఇన్‌చార్జిగా పెట్టడం నిజమా కాదా చెప్పాలన్నారు. ఇకనుంచి శ్రీకాంత్‌రెడ్డి చేసిన భూకబ్జాలు, డాట్‌ల్యాండ్ ఫైలుపైన కమీషన్ వ్యవహారం నియోజకవర్గ ప్రజలకు తెలియజేస్తానన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, మాజీ జడ్పీటీసీలు నాగసుబ్బారెడ్డి, అనుంపల్లె రాంప్రసాద్‌రెడ్డి, అంజనరెడ్డి, కనపర్తి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



గుట్టను చదును చేసి నిర్మిస్తున్న పునాదులు

మదనపల్లెలో ఇదో రకం మోసం

● స్థలం, కరెంటు మీటర్, డోర్ నెంబర్లకు తలో రేటు ● ఎన్నికలు సమీపిస్తుండటంతో తిలా పాపం తలా పిడికెడు

మదనపల్లె టౌన్, జనవరి 28: ప్రభుత్వ స్థలం కనపడితే చాలు గుట్టలు చదును చేసి అమాయకులకు బేరం పెడతారు. మీకు ఇంటి స్థలం, కరెంటు మీటర్, డోర్ నెంబరు ఇప్పిస్తామని చెప్పి రెవెన్యూ సిబ్బందితో నమ్మించేలా చేస్తారు. అంతే ఒక్కో ఇంటికి ఎంత లేదన్నా రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేస్తూ కొత్త దందా మొదలు పెట్టారు. మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్ట, అనపగుట్ట, శ్రీవారి కాలనీ, శ్రీకృష్ణ దేవాలయం ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ స్థలాలను పక్కా ప్రణాళిక ప్రకారం ఆక్రమించుకుని, రెవెన్యూ సిబ్బందిని మచ్చిక చేసుకుని కొత్త దందా షురూ చేశారు. మొదట గుట్టగా ఉన్న ప్రాంతాన్ని చదును చేసి, అక్కడ ఒక రేకుల షెడ్డు నిర్మిస్తారు. ఈ షెడ్డును చూపించి అమాయకుల వద్ద అడ్వాన్సు తీసుకుంటారు. ఇంటికి కరెంటు మీటర్, డోర్ నెంబరు ఇప్పించడంతో పాటు ఆ స్థలానికి పట్టా కూడా ఇప్పిస్తామని నమ్మిస్తారు. ఆయా ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బందిని అటువైపు రానీయకుండా చేసి మొత్తం దందా నడిపి రూ.కోటి వరకు వెనకేసుకున్నారు. స్థానిక కోళ్లబైలు పంచాయతీ పరిధిలోని అమ్మచెరువు మిట్ట దిగువన ఓ ఎంపీటీసీ, శ్రీవారినగర్ ప్రాంతంలో మరో కౌన్సిలర్ ఈ దందాలు బాహాటంగా నడిపిస్తున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు చెందిన చేనేత కార్మికులు వీరి వలలో పడి నష్టపోతున్నారు. తొలుత ప్రభుత్వ స్థలానికి అనుభవ ధృవీకరణ పత్రం ఇప్పిస్తామని నమ్మించి అడ్వాన్సు తీసుకుంటారు. తరువాత గుట్టగా ఉన్న ప్రాంతాలను (ప్రభుత్వ స్థలాలను) చదును చేసి అక్కడ పునాదులు నిర్మిస్తారు. ఈ ప్రాంతాల గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిని అటు రానీయకుండా బడా నాయకుల పేర్లు చెప్పి బెదిరిస్తారు. తీరా పునాదులు వేశాక సిమెంటు ఇటుకలతో గోడలు నిర్మించి షెడ్లులు ఏర్పాటు చేస్తారు. ఇదే సచివాలయాల్లో కరెంటు మీటర్‌కు దరఖాస్తు చేసి తప్పుడు పత్రాలతో మీటరు నెంబరు ఇప్పిస్తారు. అంతేకాకుండా ఈ ఇళ్లకు డోర్ నెంబరు ఇప్పించడంతో పాటు ఇంటి పన్నులు కూడా వచ్చేలా చేసి చక్రం తిప్పుతారు. ఇన్ని పక్కాగా చేశాక ఒక్కో ఇంటిని రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విక్రయిస్తున్నారు. అమ్మచెరువు మిట్ట, మున్సిపల్ ఒకటో వార్డు, రెండో వార్డుల్లో సుమారు 50 వరకు ఇలాంటి ఇళ్లను నిర్మించి దందా కొనసాగిస్తున్నారు. నాలుగు రోజులుగా ఈ తతంగం బయటకు రావడంతో రెవెన్యూ అధికారుల్లో చలనం వచ్చింది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలను తహసీల్దార్ దృష్టికి కొందరు తీసుకుపోవడంతో ఆక్రమణలను తొలగించాల్సిందిగా తహసీల్దార్ మహబూబ్‌చాంద్ ఆదేశించారు.

సంక్రాంతి సెలవుల్లో కట్టేశారు..

సంక్రాంతి సెలవుల్లో తాము ఊరికి వెళ్లడంతో కొందరు వ్యక్తులు పగలు, రాత్రి ప్రభుత్వ స్థలంలో పునాదులు కట్టేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఈ పునాదులు తొలగిస్తున్నాము. సమయానికి ఎక్స్‌కవేటర్ అందుబాటులో లేకపోవడం, ఆక్రమణల తొలగింపు ఆలస్యమవుతోంది. సోమవారం నుంచి అన్ని ఆక్రమణలను గుర్తించి తొలగిస్తాము.

- ప్రతాప్, ఒకటో వార్డు సచివాలయ వీఆర్‌వో, మదనపల్లె



సంక్రాంతి సెలవుల్లో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డు

ఎన్నికలు సమీపిస్తుండటంతో జోరు

ఎన్నికలు సమీపిస్తుండటంతో రెండు నెలల్లో అన్నీ చక్కబెట్టుకుని సంపాదించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగారు. ఓటరు జాబితా సిద్ధం చేయడంలో రెవెన్యూ అధికారులు బిజీగా ఉండటం ఓ వైపు, టికెట్లు తెచ్చుకునేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఈ అక్రమాల దృష్టికి వెళ్లడం లేదు. దీంతో అమ్మచెరువు మిట్ట, శ్రీవారినగర్ ప్రాంతాల్లో రాత్రికి రాత్రే అక్రమ పునాదులు వెలుస్తున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు మేల్కోవాలని పలువురు కోరుతున్నారు.



శ్రీవారినగర్ వద్ద ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన పునాదులు

రాజంపేటలో జాతీయ కబడ్డీ పోటీలు

● హోరాహోరీగా తలపడుతున్న జట్లు

రాజంపేట, జనవరి 28: జాతీయ స్థాయి అండర్-14 బాలికల పోటీలు ఆదివారం రాజంపేటలోని ఇన్‌ఫాంట్ స్కూల్ ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి మ్యాచ్‌లో వెస్ట్ బెంగాల్, సీఐఎస్‌సీఈ జట్లు పోటాపోటీగా తలపడగా వెస్ట్‌బెంగాల్ జట్టు 57 పాయింట్లు, సీఐఎస్‌సీఈ 29 పాయింట్లు సాధించగా వెస్ట్‌బెంగాల్ జట్టు విజయం సాధించింది. రెండవ మ్యాచ్‌లో తమిళనాడు, ఒరిస్సా జట్లు తలపడగా తమిళనాడు 47 పాయింట్లు, ఒరిస్సా జట్టు 19 పాయింట్లు సాధించగా తమిళనాడు జట్టు విజయం సాధించింది. మూడవ మ్యాచ్‌లో పంజాబ్, ఆంధ్రప్రదేశ్ జట్లు తలపడగా పంజాబ్ 60 జట్లు, ఆంధ్రప్రదేశ్ 53 పాయింట్లు సాధించగా పంజాబ్ జట్టు విజయం సాధించింది. నాల్గవ మ్యాచ్‌లో జమ్మూ, తెలంగాణా జట్లు తలపడగా జమ్మూ 13 పాయింట్లు, తెలంగాణా 63 పాయింట్లు సాధించగా తెలంగాణా విజయం సాధించింది. 5వ మ్యాచ్‌లో గోవా, కేవీఎస్ జట్లు తలపడగా గోవా 4 పాయింట్లు, కేవీఎస్ 26 పాయింట్లు సాధించి కేవీఎస్ జట్టు విజయం సాధించింది.



పోటీల్లో తలపడుతున్న బాలికల జట్లు

వదలని ప్లాస్టిక్ భూతం



ప్లాస్టిక్ ముప్పు వెంటాడుతోంది. ప్లాస్టిక్ వినియోగం మనుషులనే కాదు పర్యావరణాన్ని దెబ్బతీస్తుందని చెప్పవచ్చు. అధికారులు ప్లాస్టిక్ నిషేధించామని ప్రకటించుకోవడమే తప్ప ఆచరణలో మాత్రం శూన్యమే. ఫలితంగా ఏ వీధిలో చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయి. ఆకలిగా ఉన్న మూగజీవాలు కవర్లలో తినుబండారాల కోసం వెళ్లి ప్లాస్టిక్ కవర్లను సైతం తింటున్నాయి. అవి అరగక, బయటికి వచ్చే విధానం లేక పశువులు చనిపోతున్నాయి.ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణ ముప్పు రోజురోజుకూ ఎక్కువవుతోంది. కడప నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లోనూ నిషేధం ఉన్నా ప్లాస్టిక్ వినియోగం మాత్రం తగ్గడం లేదు. చాలా దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను యథేచ్ఛగా అమ్ముతున్నారు.





బద్వేలు టౌన్, జనవరి 28: పొద్దున్నే టిఫిన్ మొదలు మాంసం, కూరగాయలు, చేపలు, ఇతర ఏ వస్తువులు కొన్నా ప్లాస్టిక్ కవర్లలోనే తీసుకెళుతున్నాం. ప్లాస్టిక్‌తో ముప్పు ఉందని తెలిసినా ప్రజలు కవర్ల వినియోగం మానుకోలేకున్నారు. వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు చాలామంది మురుగు కాల్వల్లో వేస్తున్నారు. దీంతో కాల్వల్లో మురుగునీరు నిలిచిపోయి దోమలు అభివృద్ధి చెంది పలు రకాల జబ్బులు వ్యాప్తి చెందుతున్నాయి. ప్లాస్టిక్ వస్తువులు చెరువుల్లో వేయడం వల్ల జలచరాలకు నష్టం వాటిల్లుతోంది. ఈ నీటి ద్వారా పండిన పంటలు సైతం అనారోగ్యం చేకూరుస్తున్నాయి. అయినా చౌకగా సౌకర్యవంతంగా ఉంటాయని ఇంటినిండా ప్లాస్టిక్ వస్తువులతో నింపడం, వాటి వాడకం వల్ల కలిగే అనర్థాలు అన్నీ ఇన్నీ కావంటున్నారు శాస్త్రవేత్తలు. ప్లాస్టిక్‌లో అత్యంత విష పూరిత రసాయనాలు ఉంటున్నాయని దానిని పీల్చడం ద్వారా క్యాన్సర్‌కు దారి తీస్తుంని అంటున్నారు. ప్లాస్టిక్ కాల్చినప్పుడు వెలువడే వాయువులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీని వల్ల గర్భస్థ శిశువులకు సైతం క్యాన్సర్ సోకుతుంది. రోగ నిరోధక వ్యవస్థ విచ్ఛిన్నమవుతుంది. నాడీ వ్యవస్థ దెబ్బతింటుందని డాక్టర్లు చెబుతున్నారు.

నిబంధనలకు నీళ్లు

ప్లాస్టిక్ కవర్లు 50 మైక్రాన్ లోపు ఉండేవి వాడకూడదు. వీటిని రీ సైక్లింగ్ చేయడం సాధ్యం కాదు. కానీ చాలామంది వ్యాపారులు వీటినే విక్రయిస్తున్నారు. 50 మైక్రాన్ల కంటే ఎక్కువ మందం ఉన్నవి తయారు చేయాలన్నా, కొనుగోలు చేయాలన్నా ఎక్కువ ధర అవుతుందని వ్యాపారులు వీటిని వినియోగించడం లేదు. దీనికి తోడు అధికారులు దుకాణాలపై నామమాత్రంగా దాడులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


ప్లాస్టిక్ వాడకంతో అనారోగ్యం

ప్లాస్టిక్ వాడకంతో కాలుష్యం పెరిగి మానవులతో పాటు మొక్కలు, జంతువుల్లోకి విష పదార్థాలు చేరుతున్నాయి. నేలలో చేరిన ప్లాస్టిక్ కవర్లు, భూగర్భజలాలు ఇంకనీయకుండా చేస్తాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు తిని పశువులు వ్యాధుల బారిన పడి మృతి చెందుతున్నాయి. వ్యర్థాలు చేరిన నీటిని పంటలకు వినియోగిస్తే వాటిలోని రసాయనాలు మొక్కలు, వాటి దిగుబడుల్లోకి చేరుతాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను కాలిస్తే గాలిలోకి విష రసాయనాలు విడుదలవుతాయి. ఇవి ఆస్తమా, క్షయ, ఇతర శ్వాసకోశ వ్యాధులను కలిగిస్తాయి. చాలా పర్యాయాలు మిగిలిన ఆహార పదార్థాలను కవర్లలో కట్టి రోడ్లపై పడేస్తున్నారు. వీటిని మూగజీవాలు తిని రోగాల బారిన పడి ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నాయి. ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, లంచ్ బాక్సులు వాడకుండా జాగ్రత్తలు పాటిస్తే పర్యావరణాన్ని ప్లాస్టిక్ ముప్పు నుంచి కాపాడుకోవచ్చని ప్రజలు, పరిశోధకులు అంటున్నారు.



బద్వేలులో రోడ్డుపక్కన పడిఉన్న ప్లాస్టిక్ కవర్లు

కఠిన చర్యలు తీసుకుంటున్నాం..



పట్టణంలో ప్లాస్టిక్ సంచులు, కవర్లు వాడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. అనేక సార్లు బద్వేలులోని అన్ని దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాం. శానిటరీ సిబ్బంది ద్వారా మున్సిల్ యంత్రాంగం షాపుల యజమానులతో సమావేశాలు నిర్వహించి హెచ్చరికలు జారీచేశాం. అయినా అక్కడక్కడా కొందరు ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నట్లు తెలిసింది. అటువంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా ప్లాస్టిక్ వాడకుండా సహకరించినప్పుడే సత్ఫలితాలు సాధించవచ్చు.

- క్రిష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనరు, బద్వేలు

అండగా మేముంటాం

● కలిసి టీడీపీని గెలిపించుకుందాం ● ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, మాజీ ఎమ్మెల్సీ పుత్తా



ప్రసాద్‌బాబును టీడీపీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రయ్య

చెన్నూరు, జనవరి 28 : తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవడంలో మీకందరికీ మేం అండగా ఉంటాం, అందరం కలిసి టీడీపీని గెలిపించుకుందామని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి అన్నారు. జిల్లా బలిజ సంఘం నేత ఆకుల ప్రసాద్‌బాబుతో పాటు దాదాపు వంద కుటుంబాలకు పైగా టీడీపీలో చేరిన సందర్భంగా ఆదివారం చెన్నూరులో సమావేశం నిర్వహించారు. సమావేశానికి బలిజలతో పాటు మైనార్టీలు, రెడ్లు, ఎస్సీలతో పాటు పలు కుటుంబాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామచంద్రయ్య మాట్లాడుతూ వైసీపీ నేతలకు అధికార దాహం, ఆదాయంపై విపరీత ఆశ పెరిగి రాష్ట్రాన్ని ముఖ్యంగా కమలాపురం నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయకుండా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. వేల ఎకరాలు తీసుకున్నా వారికి తృప్తి లేదని, చివరికి శ్మశానంలో శవాలు పాతిపెట్టే స్థలం కూడా లేకుండా కబ్జా చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో పుత్తా నరసింహారెడ్డి అన్ని అర్హతలు ఉన్న నాయకుడని, చంద్రబాబునాయుడుకు సైతం పుత్తా అంటే ఎనలేని అభిమానమని, జిల్లాలో ఉన్న మంచి నేత కాబట్టి ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటు వేసి పుత్తాను గెలిపించుకోవాలన్నారు. పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ కేసీ ఆయకట్టు కింద ఈ ఏడాది వేలాది ఎకరాలు పంటలు సాగు చేయక బీడుగా పెట్టుకున్నారంటే అది పాలకులు చేసిన తప్పిదాలే అన్నారు. గండికోటలో నీరు ఒక టీఎంసీ వదిలి ఉంటే 10 నుంచి 12 వేల ఎకరాలు సాగయ్యేవని, ఆ నీరు వదలకపోవడంతో పొలాలు బీడు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ ప్రాంత నేత ఆదాయం, కమీషన్ల కోసమే పని చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు ఏ రైతును కదిలించినా పాలకుల ఆదాయాలు తప్ప ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అందుకే మీకు అండగా మేముంటాం, కలిసికట్టుగా అందరం కలిసి టీడీపీని గెలిపించుకుందామని ఆయన కోరారు. ఈ సందర్భంగా జిల్లా బలిజ సంఘం నేత ఆకుల ప్రసాద్ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా అన్ని కులాలు వర్గాల నేతలు టీడీపీ కండువాను కప్పుకున్నారు. రాబోవు ఎన్నికల్లో పుత్తా నరసింహారెడ్డి అఖండ మెజార్టీతో గెలవాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్సీ రామచంద్రయ్య పుత్తాను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రామక్రిష్టారెడ్డి, బలిజ సంఘం నేతలు, మాజీ సర్పంచ్‌లు జింకా సుబ్బరాయు డు, సోమశిల శ్రీనివాసులు, జనసేన నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి, 1104 అధ్యక్షుడు రమణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రామకోటిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు నారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, పట్టణ అధ్యక్షులు ఆకుల చలపతి, ఇందిరెడ్డి శివారెడ్డి, నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలాల నుంచి వచ్చిన నేతలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాతో పగిలిన వ్యవసాయ పైపులు

●రాత్రి సమయాల్లో ఇసుక తవ్వకాలు ● వెంబడించి పట్టుకొన్న గ్రామస్థులు



పైపులు పగలిపోవడంతో వృథాగా పోతున్న నీరు

నిమ్మనపల్లి, జనవరి 28: రాత్రి 12 గంటల సమయంలో ఒక ఎక్స్‌కవేటర్, ఏడు ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తుడడంతో గ్రామస్థులు వారిని వెంబడించి ఒక ట్రాక్టర్‌ను మాత్రమే పట్టుకోగా మిగిలిన వాహనాలు వెళ్లిపోయాయి. దీంతో ఆదివారం వ్యవసాయభూమి యజమాని సురేంద్రరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తవళం పంచాయతి చౌకిళ్లవారిపల్లికి చెందిన మనోహర్‌రెడ్డి కుమారుడు జగదీష్‌రెడ్డి అక్రమంగా ఇసుకను తరలించేందుకు ఒక ఎక్స్‌కవేటర్, 7 ట్రాక్టర్లతో నిమ్మనపల్లి పంచాయతిలోని ఒడ్డు వద్ద ఇసుకను తవ్వేందుకు వెళ్లారు. అయితే అప్పటికే 30 లోడ్ల ఇసుకను అక్రమంగా తరలించి తన ఇంటి వద్ద డంప్ చేసి పెట్టాడన్నారు. కాగా తన వ్యవసాయ పొలానికి వేసిన పైపులను ఎక్స్‌కవేటర్‌తో తొలగించడంతో పైపులు పగిలి నీరు మొత్తం వృథాగాపోతోందని తెలిపారు. విషయం తెలుసుకుని వెళ్లగా అప్పటికే ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు అక్కడ నుంచి పరారయ్యాయి. అయినప్పటికీ ఒక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. అయితే ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న స్థలంలో ఇద్దరు గ్రామసేవకులు కూడా ఉండటం గమనార్హం. గ్రామ సేవకుల ఫొటోలను కూడా తీసుకొన్నట్లు తెలిపారు. గ్రామ సేవకుల ప్రమేయంతోనే అక్రమ రవాణా జరుగుతుందని ఆరోపించాడు. కాగా ఇసుక అక్రమ రవాణా చేసిన జగదీష్‌రెడ్డితో పాటు ఎక్స్‌కవేటర్‌పై మిగిలిన ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పట్టుబడ్డ ట్రాక్టర్ ముష్టూరు పంచాయతీ వలసపల్లికి చెందిన నన్నేసాహెబ్‌దిగా గుర్తించారు. నన్నేసాహెబ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్‌బాబు తెలిపారు.

కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటాం

బాధిత కుటుంబాలకు టీడీపీ నేతల ఆర్థికసాయం



బాధితుల కుటుంబాలను పరామర్శిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, ద్వారకనాథరెడ్డి

గాలివీడు, జనవరి 28: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త రామాంజనేయులు, అలాగే గాయపడిన గణేశ్ కుటుంబాలను ఆదుకుంటామని టీడీపీ నాయకులు తెలిపారు. శనివారం పీలేరులో జరిగిన చంద్రబాబు సభకు వెళ్లి తిరిగి వస్తున్న సందర్భంలో మహల్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాంజనేయులు మరణించగా గణేశ్ అనే వ్యక్తికి తీవ్రగాయాలైన విషయం తెలిసిందే. ఆదివారం రామాంజనేయులు మృతదేహం తన స్వగృహమైన గోరాన్‌చెరువు బీసీ కాలనీకి వచ్చింది. అక్కడికి వెళ్లిన రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిలు మృతదేహానికి నివాళులర్పించి అనంతరం వారి కుటుంబానికి రూ.లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గోరాన్‌చెరువు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు రామాంజనేయులు, గణేశ్‌లు శనివారం పీలేరులో చంద్రబాబు సభకు వెళ్లి వస్తుండగా మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందడం, ఇంకొకరు తీవ్ర గాయాలపాలవ్వడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రామాంజనేయులు భౌతికకాయానికి నివాళులర్పించిన రామాంజనేయులు, గణేశ్ కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు.

దహన కార్యక్రమానికి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రూ.25 వేలు మృతుడి తల్లికి అందజేయగా ఇంకో లక్ష రూపాయలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ ఎన్నారై చెంచు వేణుగోపాల్‌రెడ్డి రూ.50 వేలు చొప్పున రెండు కుటుంబాలకు లక్ష రూపాయలు ఆర్థికసాయం అందివ్వనున్నట్లు తెలిపారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సీకేదిన్నె, జనవరి 28: చదరంగం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు జగతి స్కూల్ కరస్పాండెంట్ లేవాకు నితీష్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు ఆదివారం కడప నగరం రామచంద్రాపురంలోని జగతి స్కూలులో నిర్వహించారు. ఇందులో వివిధ జిల్లాల నుంచి 198 మంది విద్యార్థులు పాల్గొనగా మొత్తం ఏడు రౌండ్లు నిర్వహించి అందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశామన్నారు. మొదటి బహుమతి, మూడవ బహుమతి అనంతపురానికి చెందిన కుషాల్, వెంకటరమణ దక్కించుకోగా రెండవ బహుమతిని తిరుపతికి చెందిన వెలుగోటి యాతిన్ రెడ్డి దక్కించుకున్నారన్నారు. వీరికి రూ.లక్షతో పాటు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రామసుబ్బారెడ్డి, నాగార్జున, ఫణికుమార్, సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు నేటి వరకు గడువు

పీలేరు, జనవరి 28: ఇంటర్ పరీక్షల కోసం తత్కాల్ స్కీమ్ కింద ఫీజులు చెల్లించేందుకు ప్రభుత్వం సోమవారం వరకు గడువు పొడిగించిందని జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘ అధ్యక్షుడు నాగసురేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మార్చిలో ఇంటర్ పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు రూ.3 వేల అపరాధ రుసుముతో సోమవా రం ఫీజు చెల్లించవచ్చునని ఆయన తెలిపారు.

50 మద్యం బాటిళ్లు పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిళ్లు

కడప (క్రైం), జనవరి 28 : కడప నగరంలోని వినాయకనగర్ సర్కిల్‌లో జానీ హోటల్ సమీపంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న రూ.10 వేల విలువ గల 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కడప తాలుకా సీఐ పి.రాజ తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కడప అగాడి స్ట్రీట్‌కు చెందిన ఆటోడ్రైవరు షేక్ ఖాదర్‌బాషా అనే వ్యక్తి అక్రమ మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రాగానే ఆదివారం దాడి చేసి ఎలాంటి అనుమతుల లేకుండా ఎక్కువ ధరకు మద్యం బాటిళ్లు అమ్ముతున్న నిందితుడిని పట్టుకుని అరెస్టు చేశామన్నారు. అతడి వద్ద నుంచి 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడిలో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ ఓబులేసు పాల్గొన్నారు. వారిని ఎస్పీ, డీఎస్పీలు అభినందించారని వారు తెలిపారు.

చిన్నచౌకు పరిధిలో... : చిన్నచౌకు పరిధిలో అక్రమంగా ఆదివారం మద్యం బాటిళ్లు కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 32 డీపీఎల్ క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐలు రవికుమార్, మహ్మద్‌రఫి తెలిపారు.

ఎమ్మెల్యే ఎదుటే వ్యక్తిపై దాడి

● హౌసింగ్ బిల్లు రాలేదంటూ ఎమ్మెల్యే దృష్టికి

● బూతులు మాట్లాడి చేయి చేసుకున్న వైసీపీ నాయకుడు

కడప, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు చేస్తానని, చెప్పి డబ్బులు కూడా తీసుకున్నారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేసిన ఓ లబ్ధిదారుడిని బూతులు తిడుతూ ఎమ్మెల్యే సమక్షంలో చేయి చేసుకున్న ఘటన ఆదివారం బ్రహ్మంగారిమఠం రేకలకుంటలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలో రూ.43 లక్షలతో నిర్మితమైన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతుండగా గ్రామానికి చెందిన ఒకరు పై విషయం తెలియచేస్తుండగా, ఉపమండలాధ్యక్షురాలు సుభాషిణి భర్త, వైసీపీ నాయకుడు రాజానాయుడు ఇక్కడేంటి.. నీ.. అంటూ బూతులు తిడుతూ అక్కడి నుంచి బయటకు తోసేసి కొట్టినట్లు తెలిసింది. ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు తీసుకువస్తే ఇలాంటివి చేయడం సబబు కాదని పోనీలే అంటూ ఘర్షణ జరగకుండా పక్కకు తీసి సర్దుబాటు చేశారు. కాగా గ్రామంలో గడపగడపకు ప్రభుత్వం నిర్వహించాల్సిన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కార్యక్రమం నిర్వహించకుండానే వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా.. వాళ్ళు అన్నదమ్ములు.. దాయాదులు. వాళ్ళ మధ్య ఎన్నో ఉంటాయ్ ఏమైనా చేసుకుంటారు..తోపులాటను బూతద్దంలో చూపాల్సిన పనిలేదని వైసీపీ నాయకులు పేర్కొనడం గమనార్హం.

లీవుల్లో వివక్ష

● విలీనమైనా తగ్గని పైస్థాయి అధికారుల టార్చర్
● కౌన్సెలింగ్ పేరుతో ఆబ్సెంట్లు.. జీతాల్లో కోతలు
● తలపట్టుకుంటున్న ఆర్టీసీ ఉద్యోగులు



కడప (మారుతీనగర్), జనవరి 28: అది ఆర్టీసీ కడప డిపో... అక్కడ సుమారు నాలుగువందల మందికి పైగా డ్రైవర్లు, కండక్టర్లు విధులు నిర్వహిస్తుంటారు. వీరంతా ప్రయాణికుల సేవలో తరిస్తూ సంస్థ పురోగతే పరమావిధిగా విధులు నిర్వహిస్తుంటారు. డిపో పక్కనే గ్యారేజి ఉంది. అక్కడ వందమందికి పైగా మెకానిక్స్, శ్రామిక్స్ రాత్రి.. పగలూ అనే తేడా లేకుండా డ్యూటీలు నిర్వహిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసేలా బస్సుల కండిషన్‌ను మెరుగుపరుస్తుంటారు. పైపెచ్చు డిపోను ఇతర డిపోలకంటే మిన్నగా లాభాలబాట పట్టించేందుకు శ్రమిస్తుంటారు. ఇంతగా శ్రమించే వీరికి లీవుల విషయంలో ఇబ్బందులు తప్పడం లేదు. కొందరికే లీవులు మంజూరు చేస్తూ మిగిలిన వారిపట్ల వివక్ష చూపుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిపోలో, గ్యారేజీలో పనిచేసే ఉద్యోగులను అజమాయిషీ చేసే పైస్థాయి ఉద్యోగులు (గ్యారేజిలో ఇన్‌చార్జ్ ఎంఎఫ్, ట్రాఫిక్ సెక్షన్‌లో సీఐ) కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్స్, శ్రామిక్స్‌కు లీవులు ఇచ్చే విషయంలో తీవ్ర పక్షపాతం చూపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వారికి నచ్చిన అసోసియేషన్ల ఉద్యోగులకు ఏకంగా రెండుమూడు రోజుల పాటు లీవులిస్తూ, మిగతా అసోసియేషన్ ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉందంటూ ఒక్కరోజు మాత్రమే లీవు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. పై పెచ్చు బస్సుల ఫెయిల్యూర్స్ ఎక్కువగా ఉన్నాయంటూ కడప డిపో అధికారి, రీజియన్ స్థాయి అధికారులు సైతం వీరిని టార్చర్‌కు గురిచేస్తూ బదిలీ చేస్తామంటూ బెదిరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. మామూలుగా ఒక్కో బస్సు 15 సంవత్సరాలకు కాలపరిమితి అయిపోతుంది. కాగా అదే బస్సుకు పైపై మెరుగులద్ది రంగులు పూసినంత మాత్రాన కొత్త బస్సు కాదనే సంగతి డిపో స్థాయి అధికారులకు తెలియంది కాదు. ఇప్పటికే కాలం చెల్లిన బస్సులతోనే కొన్నిరూట్లలో పాత బస్సులను తిప్పుతున్నట్లు సమాచారం. అలాంటి కాలం చెల్లిన బస్సులనే గ్యారేజిలో రిపేర్లు చేయిస్తూ అక్కడి మెకానిక్స్, శ్రామిక్స్‌లపై తీవ్ర పనిభారం చేయిస్తున్నారనే విమర్శలున్నాయి.

ప్రశ్నించిన వారికి ఆబ్సెంట్

ఇదిలావుండగా ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయిందికదా ఉద్యోగానికి ఎలాంటి ఢోకా లేదనే భరోసాతో అధికారుల వైఖరిని ఎండగట్టిన వారిని కౌన్సెలింగ్ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. రెండు, మూడు రోజులపాటు అబ్సెంట్ వేసి నెలవారిగా వచ్చే వారి జీతాలలో కోతపడేలా చేస్తున్నట్లు సమాచారం. ఈ తంతు సంవత్సరకాలంగా ఇటు డిపోలోని ట్రాఫిక్ విభాగంలో.. అటు గ్యారేజిలో సాగుతోందనే విమర్శలున్నాయి. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అయ్యాక కింది స్థాయి ఉద్యోగులపై టార్చర్ మాత్రం మరింత తారాస్థాయికి చేరిందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ వ్యవహారంపై కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వర్‌రావును వివరణ కోరగా.. ప్రతీ పండుగకే అడిగిన వారికి లీవులిస్తున్నాం అన్నారు. ఇందులో ఎలాంటి పక్షపాతం లేదన్నారు.

18 మందికి కంటి ఆపరేషన్లు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాయచోటిటౌన్, జనవరి 28: మండల పరిధిలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 18 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మందికి పరీక్షలు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 20 మందికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ వైవీ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లయన్ చెన్నూరు అన్వర్‌బాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ రాయవరం శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు మహాలక్ష్మి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు


వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్ఐ

రామాపురం, జనవరి 28: కర్నూలు- చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం కొత్త రోడ్డు నారాయణపురం పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం సాయంత్రం లక్కిరెడ్డిపల్లె సీఐ గంగాధర్‌బాబు, రామాపురం ఎస్ఐ బీఎల్ ప్రసాద్‌రెడ్డి వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్వాసకోస వ్యాధులపై జాగ్రత్త వహించండి

సిద్దవటం, జనవరి 28: శ్వాసకోస వ్యాదులపై ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సిద్దవటం మండలం మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్య అధికారి డాక్టర్ శివకుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ సిబ్బంది ఇంటింటికీ తిరిగి చిన్న పిల్లలకు మందులు అందిస్తున్నారని తెలిపారు. శ్వాసకోస వ్యాధులతోపాటు, జలుబు దగ్గుతో ఇబ్బంది పడుతున్నవారు గ్రామాల్లోని వైద్య సిబ్బందిని సంప్రదించి మందులు తీసుకోవాలని తెలియజేశారు

పరామర్శ

సంబేపల్లె, జనవరి 28: సంబేపల్లె మండలం గురిగింజకుంట గ్రామం దిన్నెపల్లెకు చెందిన టీడీపీ నేత శెట్టిపల్లి కొండారెడ్డి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే రాయచోటి టీడీపీ ఇన్‌చార్జి రమేశ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న ప్రకాశ్ నగర్ గొల్లపల్లెకు చెందిన తోక వెంకట్రమణ, ప్రకాశ్ నగర్ కాలనీకి చెందిన వెంకట స్వామిని పరామర్శించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెయ్య యాదవ్, టీడీపీ ప్రచార కార్యదర్శి సుబ్బరాజుయాదవ్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల పంపిణీ

రామాపురం, జనవరి 28: మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె సమీపంలో ఆదివారం మహమ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చాంపియన్ క్రికెట్ టోర్నమెంట్‌లో యూసుఫ్ జట్టుపై ఆరిఫ్‌ఖాన్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు నిర్వాహకులు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లా, అంజాద్‌ఖాన్, అలీ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సిసలైన రాయలసీమ ద్రోహి జగన్‌రెడ్డి

● మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ రెడ్డి

రాయచోటిటౌన్, జనవరి 28: అసలు సిసలైన రాయలసీమ ద్రోహి జగన్‌మోహన్ రెడ్డి అని, అభివృద్ధిపై మాట్లాడే అర్హతను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఎప్పుడో కోల్పోయాడని, అవినీతి కలెక్టర్‌తో ఆయనకున్న స్నేహబంధం రాయచోటిని భూ దందాలకు నిలయంగా మార్చిందని టీడీపీ రాయచోటి ఇన్‌చార్జి రమేశ్‌కుమార్‌రెడ్డి నిప్పులు చెరిగారు. ఆదివారం స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పీలేరులో జరిగిన రా కదలిరా సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి చేశానని రాయచోటి ఎమ్మెల్యే గొంతు చించుకుంటున్నాడని, డివైడర్స్‌కు, కలెక్టరేట్‌కు రాళ్ల వేయడం, కలెక్టరేట్‌కు కేటాయించిన భూములను దోచుకోవడం, ఇసుక దందా, స్టేట్ గెస్ట్ హౌస్ కట్టడం ఒక అభివృద్ధేనా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కలెక్టర్ తో కలిసి ఆయన చేసిన అవినీతిపై ఎంక్వయిరీ చేయిస్తామని హెచ్చరించారు. కృష్ణాజలాలను రాయచోటికి తెప్పిస్తానని ఓటు అడుగుతూ బ్యానర్లు వేసుకున్నావు. ఏ ఒక్క ప్రాజెక్టుకైనా నీరు చేరిందా, అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోతే నిర్వాసితులకు ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించలేని మీరు అభివృద్ధి గురించి మాటాడుతున్నారా...? అని ప్రశ్నించారు. చేతగాని ముఖ్యమంత్రికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు తెలుగుదేశం పార్టీని గానీ, మా అధినాయకుడు చంద్రబాబు నాయుడునుగానీ విమర్శించే హక్కు లేదన్నారు. మోసాలతో కోట్లు కొలగొట్టి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో ఆ విషయం తెలుస్తుం దన్నారు. రాజకీయ వ్యాపారి జగన్‌మోహన్‌రెడ్డికి ఇక కేవలం రెండు నెలలు మాత్రమే సమయం మిగిలి ఉందన్నారు. దోపిడీలు, దౌర్జన్యాలు చేసే సమయం అయిపోయిందని, ఇక అంగడి సర్దుకోవాల్సిందేనని హెచ్చరించారు. మీ పార్టీ నుంచి క్యూ కడుతున్న వారు మీ నాయకుడి గురించి ఏం మాట్లాడుతున్నారో.. మొన్న మా పార్టీలో చేరిన మీ చిన్నాయనను అడుగు తెలుస్తుందన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ఒక్కసారి కూడా జగన్ మోహన్ రెడ్డి అపాయింట్మెంట్ కూడా దొరకలేదని ఆయన మీడియాకు వివరించారన్నారు.

ముస్లిం మైనార్టీలకు తీవ్ర అన్యాయం:

రాష్ట్రంలో మైనార్టీలకు ఎన్నడూ లేని విధంగా తీవ్రమైన అన్యాయం జరుగుతుండగా, ఈ ఎమ్మెల్యే ఏదో ముస్లిం మైనార్టీలను ఆదుకున్నామని ప్రగల్భాలు పలుకుతున్నాడని, ఎక్కడ ఎవరికి ఉపయోగపడ్డావో కొంచెం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పు డు ముస్లిం మైనారిటీల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తీసివేశారన్నారు. రిజర్వేషన్లు కల్పించామని చంకలు గుద్దుకోవడం కాదని, ఒక్క ఉద్యోగం అన్నా భర్తీ చేశారా అని ప్రశ్నించారు. రాబోయే కాలంలో రాయచోటి నియోజకవర్గంలో ముస్లింలు కచ్చితంగా బుద్ధి చెప్తారని హెచ్చరించారు. రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు హయాంలో విద్యుత్ బిల్లులు ఎంత ఉన్నాయో.. ఇప్పుడు ఎంత ఉన్నాయో ఒకసారి బిల్స్ చూసి చెప్పాలరు. మద్యపానాన్ని పూర్తిగా నిషేధించిన తర్వాతనే జనాల్లోకి వెళ్లి ఓటు అడుగుతా అని మీ ముఖ్యమంత్రి బల్లగుద్ది చెప్పాడని, ఇప్పుడు ఏం ముఖం పెట్టుకొని ఓట్లు అడగడానికి వెళ్తాడని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, రాయచోటి మండల అధ్యక్షులు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, సంబేపల్లె మండల టీడీపీ అధ్యక్షులు చిన్నరెడ్డెయ్యయాదవ్, చిన్నమండెం మండల టీడీపీ అధ్యక్షులు బెల్లం నరసింహారెడ్డి, టీడీపీ యువనాయకులు దివ్యకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మన్నూరు ఈద్గాకు ‘గంటా’ మరో 10 లక్షలు విరాళం


వేమన సతీష్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేత గంటా నరహరి

రాజంపేట, జనవరి 28: పట్టణంలోని మన్నూరు ఈద్గా అభివృద్ధికి టీడీపీ నేత గంటా నరహరి మరో 10లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. మన్నూరు ఈద్గా కమిటీ సభ్యులు ఆదివారం గంటాను కలువగా తొలి విడతగా ఈద్గాకు 10 లక్షలు విరాళం అందజేశారు. ఆ నిధులు సరిపోనందున మరో 10లక్షల రూపాయల నిధులను వెంటనే ఇవ్వనున్నట్లు తెలియజేశా రు. వారం రోజుల్లో ఈద్గా పనులు పూర్తి చేయాలని ఈద్గా సభ్యులను కోరారు. ఈద్గా కమిటీ సభ్యులు జిలానీ పాల్గొన్నారు.

జనసేన నేత భేటీ

జనసేన పార్టీ రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఏపీఎస్‌ఆర్‌టీసీ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు గంటా నరహరితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీ పరిస్థితిపై ఆరా తీశారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీకి టికెట్టు ఇచ్చినా అందరూ కలిసికట్టుగా కృషి చేయడానికి తనవంతు కృషి చేస్తామని తెలిపారు. గంటాను కలిసిన వారిలో సిద్దవటం టీడీపీ నాయకులు నాగమునిరెడ్డి, వెంకటసుబ్బయ్య, రైల్వేకోడూరు టీడీపీ నాయకులు అజయ్‌బాబు, యువనాయకులు డాక్టర్‌అఖిలేష్, రాజంపేట పార్లమెంటు మహిళా ఉపాధ్యక్షురాలు వాణి, రాజంపేట మండల పార్టీ అధ్యక్షులు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, ఒంటిమిట్ట మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, రాజంపేట సీనియర్ టీడీపీ నేతలు రమణయ్యనాయుడు, ఆర్యవైశ్య సంఘ నాయకులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్‌తో

గంటా నరహరితో ఆదివారంరాత్రి తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్ భేటీ అయ్యారు. రాజంపేటలోని టీడీపీ కార్యాలయానికి చేరుకున్న వేమన సతీష్‌కు నరహరి బొకే అందజేసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఏకాంతంగా వారు చర్చించుకున్నారు. ఓ.జి.రాజశేఖర్‌రెడ్డి, తెలుగు యువత నాయకులు పిడికిటి సంతోష్ కుమార్, సీనియర్ నాయకుడు రమణయ్య నాయుడు, తెలుగు యువత నాయకుడు చంద్రబాబు నాయుడు, దూదేకుల సంఘ నాయకుడు ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : యల్లటూరు


జనంలోకి జనసేన కార్యక్రమంలో యల్లటూరు శ్రీనివాసరాజు

నందలూరు, జనవరి 28 : ప్రజా సమస్యల పరిష్కారమే జనసేన పార్టీ ధ్యేయమని రాజంపేట నియోజకవర్గ జనసేన నేత యల్లటూరు శ్రీనివాస రాజు అన్నారు. జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆడపూరు గ్రామ పంచాయతీలో పవన్‌కళ్యాణ్ ఆశయాల ను, సిద్ధాంతాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నా.. ఈ అసమర్థ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. మరో మూడు నెలల్లో కొత్తగా జనసేన, తెలుగుదేశం పార్టీల ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వం రాబోతుందని, కొత్త ప్రభుత్వం రాగానే ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, మాజీ కో-ఆప్షన్ మెంబర్ షబ్బీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన మద్దిరేవుల యువత

లక్కిరెడ్డిపల్లె జనవరి 28 : మండలంలోని మద్దిరేవుల. రెడ్డివారిపల్లెలకు చెందిన పలు వైసీపీ కుటుంబాలు ఆదివారం లక్కిరెడ్డిపల్లెలోని టీడీపీ ఇన్‌చార్జి ఆర్ రమేష్‌కుమార్‌రెడ్డి ఇంట్లో రవికుమార్‌రెడ్డి, ఎంపి శ్రీకాంత్ రెడ్డి, ధర్మారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పదేళ్లుగా వైసీపీ జెండా మోసినా ఎలాంటి ఫలితం లేకపోగా, ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే హైదరాబాదును అభివృద్ధి చేసినట్లు ఆంధ్రప్రదేశ్‌ను కూడా అభివృద్ధి చేస్తాడన్న నమ్మకంతో టీడీపీలో చేరామన్నారు. రాజశేఖర్‌రెడ్డి, శివశంకర్, అంజి, రెడ్డెయ్య, రెడ్డిప్రసాదు, మణికంఠ, రెడ్డిశేఖర్‌రెడ్డి, అన్వర్, నాగేంద్ర, గురవయ్య, వెంకనరసింహులు, పవన్‌కుమార్‌రెడ్డి టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు.

రోడ్డు ప్రమాదబాధితుడికి గంటా ఆర్థిక సాయం


చెంగయ్య నాయుడుకు నగదు అందజేస్తున్న గన్నె సుబ్బనరసయ్యనాయుడు

రాజంపేట, జనవరి 28 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న సింగనవారిపలెకు చెందిన టీడీపీ నేత పత్తిపాటిచెంగయ్య నాయుడుకు టీడీపీ నేత గంటా నరహరి రూ. 50 వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, గంటా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి తిరుమలశెట్టి మితులేష్, టీడీపీ పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం సంయుక్త కార్యదర్శి పలుకూరి ఉగ్రవీంద్ర, ఆర్యవైశ్య నాయకులు సునీల్, మదళ్లపల్లె సునీల్‌కుమార్, యువనాయకులు పిడికిటి సంతోష్‌నాయుడు తదితరులు ఆ మొత్తాన్ని అందజేశారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ


అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ప్రసాద్‌బాబు

చిన్నమండెం, జనవరి 28: మండలంలోని దిగువగొట్టివీడు గ్రామం మంచింటివారి పల్లెలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు సుగువాసి ప్రసాద్ బాబు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిగువగొట్టివీడు తమ కుటుంబానికి చాలా ఇష్టమైన గ్రామ మని, ఈ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం భూమిపూజకు తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంచింటి ఆంజనేయులు, సీపీఐ నేత విశ్వనాథ, ఎంఆర్‌పీఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బండకింద మనోహర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ప్రతాప్‌నాయుడు, హనుమంతునాయుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొజ్జా వెంకట్రమణ, కాంట్రాక్టర్ దేవగోపాల్‌నాయుడు, నాగేశ్వర, పెంచలయ్య, రెడ్డెప్ప, వెంకటేశ్, మన్నేరు రామాంజనేయులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఐదు కుటుంబాలు సీపీఐలో చేరిక


సీపీఐలో చేరిన అనంతరాజుపేట వాసులు

రైల్వేకోడూరు, జనవరి 28: మండలంలోని అనంతరాజు పేటలో ఐదు కుటుంబాలకు చెందిన సంగనపల్లి రామచంద్రయ్య, సంగనపల్లె సుబ్రహ్మణ్యం, చెన్నూరు పకీరయ్య, శ్రీను, అయ్యాముల చిన్న వెంకటయ్య, చందనపుల హరి తదితరులు ఆదివారం సీపీఐ లో చేరినట్లు రైల్వేకోడూరు సీపీఐ ఏరియా అధ్యక్షుడు జ్యోతి చిన్నయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతరాజుపేట పంచాయతీలో ఏపీఎండీసీ నాలుగు నాలుగు నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయగా ఒక్క ప్లాంట్ మాత్రమే పని చేస్తోందన్నారు. సచివాలయం ప్రాంతంలో వీధి లైట్లు లేక పోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు ఆ దారిలో వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్టీ లో చేరినట్లు ఆయన వివరించారు.

ముమ్మరంగా విందు రాజకీయాలు


పెరుమాళ్లపల్లె కమ్మపల్లెలో చర్చిస్తున్న ముక్కా రూపానందరెడ్డి తదితరులు

రైల్వేకోడూరు, జనవరి 28: రైల్వేకోడూరునియోజకవర్గంలో విందు రాజకీయాలు జోరందుకున్నాయి. ఆదివార పెరుమాళ్లపల్లె కమ్మపల్లెలో టీడీపీ నాయకుడు ముక్కా రూపానంద రెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తదితరులు పలు సామాజిక వర్గాల నాయకులు, కార్యకర్తలతో ముమ్మరంగా చర్చించారు. టీడీపీ బలోపేతం నుంచి వైసీపీని ఎన్నికల్లో ఓడించే అంశాలపై చర్చలు సాగాయి. ఈ చర్చల్లో సీనియర్ టీడీపీ నేత బ్రహ్మయ్యనాయుడు, ఇతర మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవిష్యత్తు తెలుగు యువతదే..

గాలివీడు, జనవరి 28: భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీలో తెలుగు యువతదే ప్రధాన పాత్ర పోషించాల్సి ఉంటుందని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న ఆదివారం తన కార్యాలయంలో గాలివీడు మండలం నూలివీడు పంచాయతీ నక్కావాండ్లపల్లెకు చెందిన పెద్దు కరుణాకర్‌రెడ్డికి తెలుగుదేశం పార్టీ జెండా బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు మరింత ఉత్సాహంగా సోషల్ మీడియా ద్వారా వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. తెలుగు యువత మండల అధ్యక్షులు చిన్నారుల వెంకట్రమణా రెడ్డి, సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నేత సుబ్రహ్మణ్యంరాజుకు ఘన నివాళి


నివాళి అర్పిస్తున్న బీజేపీనాయకులు

రైల్వేకోడూరు, జనవరి 28: జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఉమ్మలరాజు సుబ్రహ్మణ్యం రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం రైల్వేకోడూరు బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి బీజేపీ రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పనతల సురేష్, బీజేపీ రైల్వేకోడూరు కన్వీనర్ గడ్డం చంగల్‌రాజు, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు దాసర్రాజు జయప్రకాష్ నారాయణవర్మ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. తోట శ్రీనివాసులు, వాకచర్ల సుబ్బారావు, ఊటుకూరు చలపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి

నందలూరు, జనవరి 28 : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉమ్మడి కడప జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపును ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యతో పాటు కర్రసాము, నృత్యం, పాటలు, సాంస్కృతిక కార్యక్ర మాలలో ప్రావీణ్యం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి రాజగోపాల్‌రెడ్డి, స్కౌట్‌మాస్టర్ భరత్‌కుమార్, సీనియర్ క్రీడాకారులు గుండు మల్లికార్జునరెడ్డి, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ గ్రేడింగ్ టెస్టులు


బెల్ట్‌గ్రేడింగ్‌లో విజయం సాధించిన క్రీడాకారులతో నిర్వాహకులు

రాజంపేట, జనవరి 28 : పట్టణంలోని జీఎంసీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఊటుకూరు ఎంపీటీసీ సభ్యుడు నాగచంద్ర శేఖర్ రెడ్డి, 12వ వార్డు కౌన్సిలర్ రమేష్‌నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ విద్యా, ఉద్యోగాల్లో స్థానం పొందాలంటే క్రీడల్లో కూడా రాణించాలన్నారు. అకాడమీ మాస్టర్ సునీల్ మాట్లాడుతూ బెల్ట్ గ్రేడింగ్ టెస్టు విజేతలు 19 మందికి ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందజే స్తున్నట్లు తెలిపారు. అకాడమీ ఉపాధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శి నరసింహ, కోచ్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ఘనంగా పూజలు



లక్కిరెడ్డిపల్లె జనవరి 28; మండలంలోని అనంతపురం గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. ఈఓ రవీంద్ర రాజు, చైర్మన్ నరసింహారెడ్డి భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుంగా చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు.

కాషాయీకరణ నుంచి విద్యా రంగాన్ని కాపాడాలి

● ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్

రాయచోటిటౌన్, జనవరి 28: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దుచేసి విద్యా వ్యవస్థ కాషాయమయం కాకుండా కాపాడడానికి ఫిబ్రవరి 1న ఆల్‌ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో చెన్నైలో నిర్వహించనున్న మహార్యాలీని జయప్రదం చేయాలని ఆ అసోషియేషన్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవ కుమా ర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం పేరుతో సెకండరీ విద్యను తుంగలో తొక్కి ఉన్నత విద్యను అయోమయం లోకి నెట్టివేశారన్నారు. విద్యను పూర్తి స్థాయిలో ప్రైవేటీకరణ, కాషాయమయం చేయడానికి ఈ నూతన జాతీయ విద్యా విధానం దోహదపడుతుందన్నారు. విద్యా వ్యవస్థను తన కబంధహస్తాలలో పెట్టుకోవాలనే ఆలోచన మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కిరణ్‌కుమార్, ఏరియా అధ్యక్షులు రెడ్డిమహేశ్, నాని, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయమంటే మట్టి పోస్తారా....



ప్రధానదారిలో పోసిన మట్టిలోని రాయిని వెలికితీస్తున్న యువకుడు. గోతుల వద్ద కంకర, మట్టి పోస్తున్న లారీ

రైల్వేకోడూరు, జనవరి 28: గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతులు చేయమంటే పట్టించుకోకుండా ఆ గుంతల వద్ద మట్టి, రాళ్లు కుప్పలుగా వేసి పోయారని మాధవరంపోడు, జ్యోతికాలనీ, మైసూరివారిపల్లె తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఆరోపించారు. రాజంపేట-రైల్వేకోడూరు ప్రధాన రహదారికి మరమ్మతులు చేశారు. కానీ రైల్వేకోడూరు- తిరుపతి ప్రధానదారి మాత్రం మరమ్మతులు చేయకుండా వదిలేశారని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రాళ్లు వాహనాల టైర్లకు తగిలి ఇళ్లపైన పడుతు న్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రోడ్లను బాగు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఏపీఎండీసీ అక్రమాలపై నిగ్గు తేల్చాలి

ఓబులవారిపల్లె, జనవరి 28: ఏపీఎండీసీ మైనింగ్ అక్రమాలపై నిగ్గు తేల్చాలని భారతీయ జనతా పార్టీ నేతలు డిమాండ్ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంగంపేటలో అక్రమాలు పెరిగిపోయాయన్నారు. ఈ అక్రమాలకు కారణమైన నాయకులు, కాంట్రాక్టర్లు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన టార్గెట్‌ను రీచ్ కావడానికి ఐదారేళ్ల పట్టే ఎగుమతులను రెండు నెలల్లోనే పూర్తి చేయడం అనేది చాలా ఆశ్చర్యానికి గురి చేస్తోందన్నారు .ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ఎంతో విలువైన ఫుల్లరిన్ వెలికి తీసే అవకాశం ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవ న్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పనతల సురేష్, నియోజకవర్గ నాయకులు గడ్డం చెంగల్‌రాజు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు హేమనవర్మ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాల నేరస్తులకు న్యాయ సహాయం

కడప(రూరల్) జనవరి 28: పాన్ ఇండియా ప్రచారం 2024లో భాగంగా జైళ్లలో ఉన్న బాలనేరస్తులను గుర్తించి తగు న్యాయసహాయం అందించాలని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ ఎస్. బాబాఫక్రుద్దీన్ సూచించారు. కడప పురుషుల, మ హిళల కేంద్ర కాగారాలలో ఆదివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లతో టీమ్‌లను ఏర్పాటు చేసి పురుషుల కేంద్రాగారం, మహిళా కేంద్ర కారాగారాల్లోలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రచార సమయంలో జైళ్లలో ఉన్న బాల నేరస్తులను గుర్తించి వారికి తగు న్యాయ సహాయం అందించడం ఈ ప్రచారం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. జిల్లా వ్యాప్తంగా కడప, ప్రొ ద్దుటూరు, రాయచోటి, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల, కమలాపురం జైళ్లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సులో పురుషుల, మహిళల కేంద్రకాగారాల సూపరింటెండెంట్‌లు ప్రకాష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

టీటీడీ పాలకమండలిని భగవంతుడు క్షమించడు

సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావు



దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 28: టీటీడీ యాజమాన్యాన్ని, పాలకమండలిని భగవంతుడు కూడా క్షమించడని సీపీఐ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. టీటీడీ అటవీ కార్మికుల రెండో రోజు నిరవధిక దీక్షలో ఉన్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళిని, కార్మికులను ఆయన పరామర్శించి, రెడ్ సెల్యూట్ చేశారు. 1,159రోజులుగా టీటీడీ అటవీ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే టీటీడీ యాజమాన్యం ఏం చేస్తోందని ప్రశ్నించారు. కరుణాకరరెడ్డి లాంటి వ్యక్తి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నా ఆమరణ నిరాహారదీక్షలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందంటే పరిస్థితి ఏపాటిదో అర్థమవుతోందన్నారు. తక్షణం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అటవీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి పోరాటం, అధికార పార్టీ అవకాశవాదం తదితర అంశాలతో సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు పాడిన ఉయ్యాల-ఉయ్యాల పాట ఆకట్టుకుంది. అంగన్వాడీ యూనియన్ నేత నాగరాజమ్మ ఆధ్వర్యంలో మహిళలు కోలాటం, గొబ్బెమ్మ పాటలను దీక్షా శిబిరం ఎదుట ప్రదర్శించారు. చంద్రశేఖర్ భాగవతార్ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళాకారులు కచేరి నిర్వహించారు. రమాదేవి హాస్పిటల్ తరఫున వైద్యులు, సిబ్బంది శిబిరం వద్దకు చేరుకుని దీక్షలో ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం, నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యం ఆందోళనకరం

టీటీడీ అటవీ కార్మికులకు మద్దతుగా నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టిన కార్మిక నేతలు కందారపు మురళి సహా కార్మికుల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని డాక్టర్ కిషోర్ ప్రకటించారు. ఆదివారం రాత్రి వైద్య పరీక్షలు నిర్వహించిన ఆయన షుగర్ లెవల్స్ పడిపోయాయని, బీపీ ఆందోళనకరంగా ఉందని తెలిపారు. తమ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉన్నా దీక్షలు విరమించేది లేదని, సమస్య పరిష్కారమయ్యే కొనసాగిస్తామని భీష్మించారు.

ఎంపీడీవోలకు మండలాల కేటాయింపుపై కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 28: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎంపీడీవోల్లో 23 మందిని అనంతపురం జిల్లాకు, ముగ్గురిని కడప జిల్లాకు బదిలీ చేశారు. వారి స్థానంలో చిత్తూరు జిల్లాకు 17మందిని నెల్లూరు జిల్లా నుంచి, 15 మందిని కడప జిల్లా నుంచి.. వెరసి 32 మందిని బదిలీ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు వస్తున్న వారికి జిల్లాలో పోస్టింగ్స్ ఇవ్వడంపై జిల్లాపరిషత్ యంత్రాంగం కసరత్తు చేస్తున్నది. ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్తున్న వారిని విధులనుంచి రిలీవ్ చేసేందుకోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్‌కు ఫైళ్లు పంపేందుకు జడ్పీ కార్యాలయ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కలెక్టర్ ఆమోదించిన తర్వాత ఈనెల 30వ తేదీలోపు బదిలీ అయిన ఎంపీడీవోలను జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి రిలీవ్ చేయనున్నారు. ఆ తర్వాత నెల్లూరు, కడప జిల్లాల నుంచి బదిలీపై రానున్న ఎంపీడీవోలకు ఉమ్మడి చిత్తూరుజిల్లా పరిధిలోని 65 మండలాల్లో ఖాళీలను బట్టి పోస్టింగ్స్ ఇస్తారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించేవరకు వీరు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే విధులు నిర్వహించనున్నారు.

శారదపీఠం భవన నిర్మాణాలు నిలిపేయాలి




కరపత్రం చూపుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

తిరుపతి (తిలక్‌రోడ్), జనవరి 28 : తిరుమలలో విశాఖ శారదాపీఠం చేపట్టిన సెవెన్‌స్టార్ బిల్డింగ్ అక్రమ నిర్మాణం నిలిపివేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీరుగట్టు నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో కట్టడాలు చేపట్టడం బాధాకరమన్నారు. హైకోర్టు అడ్వకేట్ కమిషనర్‌ను పంపడం తిరుమల చరిత్రలో ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. సనాతన ధర్మాలను, హిందూ సంప్రదాయాలను కాపాడుతూ భగవంతుడి దర్శనానికి వచ్చే భక్తులకు సేవలందించాల్సిన కొన్ని పీఠాలు టీటీడీ నిబంధనలు పాటించకుండా రాజకీయ పలుకుబడితో ఇష్టానుసారంగా వ్యవహరించడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. టీటీడీ వ్యవస్థను ఉద్యోగులు తప్పుదారి పట్టిస్తున్నారని, తక్షణమే ఈ అక్రమ భవనాలను తొలగించాలని, లేకపోతే భక్తులతో కలిసి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు బొంతల రాజేష్ రాయల్, వెంకటా చలపతి, కోడివాక చందు, కందనూరు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి కొత్త కలెక్టర్‌గా లక్ష్మీషా

హౌసింగ్ ఎండీగా వెంకటరమణారెడ్డి



తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డాక్టర్ జి.లక్ష్మీషా నూతన కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ఈ మార్పులు జరిగాయి. ప్రస్తుత కలెక్టర్ వెంకరమణారెడ్డి.. ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా నియమితులు కానున్నారు. ఇపుడు ఎండీగా ఉన్న లక్ష్మీషా ఇక్కడికి కలెక్టర్‌గా రానున్నారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన లక్ష్మీషా కర్ణాటక రాష్ట్రం తుంకూరు జిల్లాలోని మారుమూల గ్రామమైన హోలుగుండనహల్లికి చెందినవారు. సివిల్స్‌లో తొలుత ఐఎఫ్ఎస్‌కు ఎంపికై హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌లో పనిచేశారు. తర్వాత 2013లో మరోసారి సివిల్స్ రాసి ఐఏఎస్ సాధించి ఏపీ కేడర్ ఎంచుకున్నారు. కర్నూలులో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న లక్ష్మీషా కృష్ణా జిల్లా నూజివీడు సబ్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ అందుకున్నారు. ఆపై పార్వతీపురం ఐటీడీఏ పీవోగానూ, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గానూ, గ్రేటర్ వైజాగ్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా పనిచేస్తున్నారు.

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం జరగనుంది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు సమావేశమై అజెండా అంశాలపై చర్చించనున్నారు. ఫిబ్రవరిలో జరగనున్న ధార్మిక సదస్సుతోపాటు ఒక్కరోజు బ్రహ్మోత్సవంగా పిలిచే రథసప్తమి ఏర్పాట్లపై చర్చించనున్నారు. అలాగే తిరుపతి, తిరుమలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ రకాల కొనుగోళ్లు, ఇంజనీరింగ్ పనులపై చర్చ జరగనుంది. ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో 2024-25 వార్షిక బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఈవిషయాన్ని టీటీడీ గోప్యంగా ఉంచింది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని

ఇద్దరు శ్రీవారి భక్తుల దుర్మరణం



వరదన్ మృతదేహం

నారాయణవనం, జనవరి 28: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు శ్రీవారి భక్తులు దుర్మరణం చెందిన ఘటన నారాయణవనం మండలం రాళ్ల కాలవ వద్ద ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్ఐ పరమేష్ నాయక్ కథనం మేరకు.... తమిళనాడుకు చెందిన మోహన్, వరదన్ శ్రీవారి దర్శనం కోసం కాలినడకను తిరుమలకు బయలుదేరారు. ఆదివారం ఉదయం నారాయణవనం మండలం రాళ్ల కాలవ వద్ద వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మోహన్ అక్కడికక్కడే మృతి చెందగా, వరదన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని స్థానికులు పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఊరొదిలి వెళ్లినా ఓటర్లే


● జాబితాలో మృతుల పేర్లూ యథాతథం

కల్లూరు, జనవరి 28: పులిచెర్ల మండలంలోని ఓటర్ల జాబితాను పరిశీలించే కొద్దీ కుప్పలు తెప్పలుగా తప్పులు వెలుగుచూస్తున్నాయి. తుది ఓటర్ల జాబితాలోనూ చాలావరకు తప్పులు యథాతథంగా ఉన్నాయి. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి 257 పోలింగ్‌స్టేషన్‌లో 30 ఏళ్ల కిందట ఊరువిడిచి వెళ్లిన ఓటర్లు సైతం జాబితాలో ఉన్నారు. సీరియల్ నెంబరు 398 హరినాథ్, 399 ఆర్‌డి కుమార్, 401 కె.లత, 402 మంజునాథ్.. వీరి కుటుంబం 30 ఏళ్ల కిందట తమిళనాడు రాష్ట్రం వేలూరుకు వెళ్లిపోయారు. అయితే ఓటర్ల జాబితా నుంచి ఈ పేర్లను తొలగించకోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.




ఊరువిడిచి వెళ్లినా ఎల్లంకివారిపల్లెలో ఓటర్లే

మృతులకూ ఓట్లు



దేవళంపేట పంచాయతీలోని 242 పోలింగ్‌స్టేషన్ పరిధిలో ఏళ్ల కిందట చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించలేదు.సీరియల్ నెంబరు 351లోని ఇనుకులవారిపల్లికి చెందిన తులసీరాం రెండేళ్ల మృతి చెందాడు. సీరియల్ నెంబరు 410లోని రెడ్డివారిపల్లికి చెందిన వెంకటాచలం మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించారు. సీరియల్ నెంబర్లు 661, 674లోని కొక్కువారిపల్లికి చెందిన సఫియాబి, గౌస్ సాహెబ్ రెండేళ్ల క్రితం మృతి చెందారు.సీరియల్ నెంబర్లు 824, 830లోని బెస్తపల్లికి చెందిన యోగానంద్, గోపాలయ్య రెండేళ్ల క్రితం మరణించినా జాబితా నుంచి ఆ పేర్లను తొలగించలేదు.

ఊరొదిలి ఇరవై ఏళ్లయినా ఓటరే..!



ఏళ్ల క్రితం ఊరొదిలి వెళ్లినా ఓటరుగానే...


వెదురుకుప్పం, జనవరి 28: తుది ఓటర్ల జాబితాలో ఊరు వదిలి వెళ్లి ఏళ్లు గడిచినా ఓటరుగానే ఉన్నారు. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్ర పరిధికి సంబంధించి పచ్చికాపల్లంపేట గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి(63) ఊరు వదిలి వెళ్లిపోయి ఇరవై ఏళ్లు గడుస్తున్నాయని స్థానికులు తెలిపారు. కానీ, అతడికి క్రమసంఖ్య-282తో ఇంటి సంఖ్య-3-5తో తాజా జాబితాలో ఓటు ఉంది.

రెండు పంచాయతీల్లోనూ ఓటర్లుగా దంపతులు



కావేటిగారిపల్లి, మంగళంపేట పంచాయతీల్లో 15 ఏళ్లుగా ఓ దంపతులు ఓటర్లుగా కొనసాగుతున్నారు. కావేటిగారిపల్లి పంచాయతీ 262 పోలింగ్‌స్టేషన్ పరిధిలోని కమలాపురానికి చెందిన సీరియల్ నెంబర్లు 132, 135లోని కే సురేంద్ర, కే నీల దంపతులు. ఈ దంపతులు 15 ఏళ్ల క్రితం మంగళంపేటలో స్థిరపడ్డారు. మంగళంపేట 251 పోలింగ్‌స్టేషన్ పరిధిలో సీరియల్ నెంబర్లు 23, 24లో నీలావతి, సురేంద్రగా ఓటర్ల జాబితాలో ఉన్నారు. అయితే కావేటిగారిపల్లి పంచాయతీలోనూ వీరు ఓటర్లుగా కొనసాగుతున్నారు.

వెలుగుచూస్తున్న డబుల్ ఎంట్రీలు



మతుకువారిపల్లి పంచాయతీలోని 233 పోలింగ్‌స్టేషన్ పరిధిలో సీరియల్ నెంబర్ 616 నితీష్‌రెడ్డి డీఎస్‌ఏ తండ్రిపేరు డీఎస్‌ఏ సుధాకర్‌రెడ్డి రెడ్డి డీఎస్‌ఏ జ్యోతిగా ఉంది. ఇదే పోలింగ్ స్టేషన్‌లో సీరియల్ నెంబరు 617లో నితీష్‌రెడ్డి దిగువసదుం తండ్రిపేరు సుధాకర్‌రెడ్డి దిగువసదుంగా ఓటర్ల జాబితాలో నమోదైంది. ఒకే జాబితాలో డబుల్ ఎంట్రీని తొలగించడంలో అధికారులు విఫలమయ్యారు.

మెట్టినింటికెళ్లినా పుట్టింట్లో తొలగని ఓట్లు



ఎల్లంకివారిపల్లి పంచాయతీలోని 257 పోలింగ్‌స్టేషన్ పరిధిలో సీరియల్ నెంబరు 33లోని ఎల్లంకివారిపల్లికి చెందిన దివాకర్ కుమార్తె మాధురికి ఏడేళ్ల కిందట కేవీపల్లె మండలానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. ఇదే గ్రామంలోని సీరియల్ నెంబరు 666 ఉన్న రమేష్ కుమార్తె ప్రశాంతికి 2017లో తిరుత్తణికి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. అయినా, వీరిద్దరి పేర్లను ఇక్కడి ఓటర్ల జాబితా నుంచి తొలగించలేదు.

నియంతృత్వ పోకడలతో విద్యారంగం నిర్వీర్యం

● మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

చిత్తూరు (సెంట్రల్), జనవరి 28: కార్పొరేట్ రంగానికి కొమ్ము కాసి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే పాలకులకు ఉద్యమాలతో సమాధానం చెబుతామని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి హెచ్చరించారు. చిత్తూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దేవరాజులు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వేల కోట్ల రూపాయలతో పాఠశాలలను ఉద్ధరించామని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు.. వీటిలో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతుందో చెప్పాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమాన్ని విస్మరించి, ఉద్యమాలపై ఉక్కుపాదం మోపడం సరికాదన్నారు. ఆంగ్ల మాధ్యమంతో పాటు, తెలుగు మాధ్యమాన్నీ కొనసాగించాలన్నారు. ఉత్తుత్తి పీఆర్‌సీ కమిటీల పేరుతో మభ్యపెట్టడం మానుకోవాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి కల్పించాలన్నారు. మున్సిపల్ టీచర్లకు ఇప్పటి వరకు సర్వీసు రూల్స్ అమలు చేయలేకపోవడం దారుణమని విమర్శించారు. సమగ్రశిక్ష, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి చొరవచూపాలన్నారు. అంతకు ముందు ఎస్టీయూ సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర నాయకులు నాగేశ్వర్‌రావు, రఘునాథ రెడ్డి, గంటా మోహన్, పురుషోత్తం, హేమచంద్రరెడ్డి, లోకనాథ్, మదన్‌మోహన్, గురుకుమార్, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా మదన్‌మోహన్

జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్.ఆర్.మదన్‌మోహన్‌రెడ్డి (యాదమరి), ప్రధాన కార్యదర్శిగా బి.మోహన్(పుంగనూరు), ఆర్థిక కార్యదర్శిగా టి.యువరాజ్ (కార్వేటినగరం), అసోసియేట్ అధ్యక్షులుగా రమణారెడ్డి, చిట్టిబాబు, చంద్రన్, సుబ్రమణ్యం, అదనపు ప్రధాన కార్యదర్శులుగా అమర్నాథ్‌రెడ్డి, కిషోర్, చెంగల్‌రాయల్, విజయలక్ష్మి, పవన్‌కుమార్, బొబ్బిలి, ఉపాధ్యక్షులుగా జ్యోతీశ్వరుడు, సుమతి, శ్రీనివాసులు, మోహన్, కమలాపతి, రాజా, పరదేశి, వాసు, కార్యదర్శులుగా హరినాథ్, కన్నయ్య, లక్ష్మీదేవి, ఫణి, వనిత, ఉషారాణి, పురుషోత్తం, చంద్రశేఖర్, కోదండయ్య, చైతన్య, వెంకటరత్నం, ఆంజనేయులు, ఆర్థిక కమిటీ సభ్యులుగా సూర్యకుమార్, శ్రీనివాసులు, ధనరాజ్, నాగరాజు, జనార్దన్, మహిళా కన్వీనర్‌గా జి.అనిత, మైనారిటీ కన్వీనర్‌గా యాసిన్ షరీఫ్, సీపీఎస్ కమిటీ కన్వీనర్‌గా భాస్కర్‌రాజు, ఉపాధ్యాయ కన్వీనర్‌గా సర్దార్, ప్రచార కమిటీ కన్వీనర్‌గా ప్రసాద్, సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా మంజుల, రాష్ట్ర కౌన్సిలర్లుగా గంటా మోహన్, దేవరాజురెడ్డి, పురుషోత్తం, జగన్మోహన్‌రెడ్డి, లోకనాథరెడ్డి, జయరామప్ప, ఇలియాస్ బాషా, హేమచంద్రరెడ్డి, రమేష్‌కుమార్, శ్రీదేవి, జనార్దన్‌రెడ్డిని ఎన్నుకున్నారు.



ఎస్టీయూ నూతన కార్యవర్గం

అధికార దుర్వినియోగంతో వ్యవస్థలు నాశనం

మాజీమంత్రి అమరనాథరెడ్డి



అమరనాథరెడ్డికి మంగళహారతులు పడుతున్న మహిళలు

పెద్దపంజాణి, జనవరి 28: సీఎం జగన్ అధికార దుర్వినియోగానికి పాల్పడి వ్యవస్థల్ని నాశనం చేశారని మాజీమంత్రి అమరనాథ రెడ్డి విమర్శించారు. ఆదివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన పెద్దపంజాణి మండలంలోని బొమ్మరాజుపల్లె, వలసపల్లె, కుంట్లకింద, అమ్మరాజుపల్లె, వడ్డూరు. ముదరంపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ అవినీతిని ఎండగట్టారు. ఆయన మాట్లాడుతూ అవగాహనలేని వ్యక్తులకు అధికారం కట్టబెట్టడంతో రాష్ట్రం అంధకారంలోకి పోయిందన్నారు. కొత్తపరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారన్నారు. దీంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నారన్నారు. అప్పు చేస్తే తప్పా ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చారన్నారు. నాడు-నేడుతో గోడలకు రంగులేసి కోట్లరూపాయలు దండుకున్నారన్నారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన మీరు సిగ్గుతో తలవంచుకునే రోజు దగ్గరలో ఉందన్నారు. అనంతరం ముదరంపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, సి.సుబ్రమణ్యం, శంకర్, గంగాధర్, వెంకటరత్నం, కృష్ణప్ప తదితరులు టీడీపీలో చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చలపతి, మాజీ ఎంపీపీ మురళీకృష్ణ, సర్పంచ్ రుద్రమూర్తినాయుడు, నాయకులు మురహరిరెడ్డి, నాగరాజ రెడ్డి, శివాడి నాగరాజ, గంగప్ప, వేమారెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, ముబారక్‌తాజ్, రెడ్డెప్పరెడ్డి, హరినాథరెడ్డి, గణపతి, జయరాంరెడ్డి, శ్రీరాములు, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి చిత్తూరులో ఏడు ఉత్తమ హరిత పాఠశాలల ఎంపిక

స్టేట్ కో-ఆర్డినేటర్ నీలకంఠయ్యకు జాతీయ అవార్డు



నీలకంఠయ్య

తిరుపతి(విద్య), జనవరి 28: ఏపీ నేషనల్ గ్రీన్ కోర్, సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్(ఢిల్లీ) ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉత్తమ హరిత పాఠశాలలుగా 7 హైస్కూల్స్ ఎంపికయ్యాయి. రాష్ట్రంలో 3,450స్కూల్స్ నమోదు చేసుకుని, ఇప్పటివరకు 900కిపైగా గ్రీన్ ఆడిటింగ్‌ను సమర్పించినట్లు గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్ రాష్ట్ర కోఆర్డినేటర్ పి.నీలకంఠయ్య పేర్కొన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో ఉత్తమ హరిత విభాగంలో 12 స్కూల్స్ ఎంపికవగా..అందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏడు ఉన్నట్లు వివరించారు. కాగా ల్యాండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో వాల్మీకిపురం మండలంలోని గండబోయినపల్లె జెడ్పీహెచ్ఎస్ అవార్డుకు ఎంపికైంది. ఈ ప్రోగ్రామ్‌ని క్షేత్రస్థాయిలో ముందుకు తీసుకెళ్తున్న స్టేట్ కోఆర్డినేటర్, కరకంబాడి జెడ్పీహెచ్ఎస్ బయాలజీ టీచర్ పి.నీలకంఠయ్యను జాతీయ స్థాయిలో ఉత్తమ కోఆర్డినేటర్‌గా ఎంపిక చేశారు. ఈనెల 30న న్యూఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డు, ధ్రువపత్రాలను అందిస్తారు. నీలకంఠయ్యను గ్రీన్‌స్కూల్ ప్రోగ్రామ్ స్టేట్ డైరెక్టర్ పి.స్రవంతి, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ అభినందించారు.

● ఉత్తమ హరిత విభాగంలో ఎంపికైన పాఠశాలలు : జెడ్పీహెచ్(గండబోయినపల్లె, వాల్మీకిపురం మండలం), జెడ్పీహెచ్ఎస్(మర్రిపాడు, గుర్రంకొండ మండలం), జెడ్పీహెచ్ఎస్(తవణంపల్లె), జెడ్పీహెచ్ఎస్(ఆర్‌కేఎంపురం, వెదురుకుప్పం మండలం), జెడ్పీహెచ్ఎస్(కల్లూరు), జెడ్పీజీహెచ్ఎస్(నారాయణవనం), జెడ్పీహెచ్ఎస్(పాలమంగళం).

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు

తిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.

వివాహిత మృతిపై నిరసన

● వరకట్న వేధింపుల కింద కేసు నమోదు

● హత్య కేసుగా నమోదు చేయాలని ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయింపు



స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన ప్రదర్శన చేస్తున్న మృతురాలి బంధువులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27: వివాహిత ఆత్మహత్యకు సంబంధించి హత్య కేసు నమోదు చేయాలని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం నిరసనకు దిగారు. స్టేషన్ ఎదుట బైఠాయించారు. సీఐ మహేశ్వర్‌రెడ్డి వారితో చర్చించి, నచ్చజెప్పి వరకట్న వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్టు కేసు నమోదు చేశారు. అశోక్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్, మలర్మతి కుమారుడు ధనరాజ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కర్ణాటక రాష్ట్రం, కొప్పల్ జిల్లా గంగావతికి చెందిన రామన్ కుమార్తె జ్యోతిక (23)ను ఒకటిన్నర సంవత్సరం క్రితం పెళ్లి చేసుకున్నాడు. అశోక్‌నగర్‌లోనే నివాసముంటున్నారు. శనివారం రాత్రి భర్తతో జరిగిన చిన్నపాటి గొడవ కారణంగా ఇంట్లోని ఓ గదిలోకి వెళ్లి తలుపు గొళ్లెం పెట్టుకుంది. ఎంతకీ తలుపు తీయకపోవడంతో భర్త ధనరాజ్ కుటుంబ సభ్యులతో కలిసి గడ్డపారతో తలుపులు పగులగొట్టి చూడగా జ్యోతిక ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. ఆమెను కిందికి దించి సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు రుయాకు తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి అప్పటికే ఆమె మృతిచెందినట్టు ధ్రువీకరించారు. పోలీసులు ఆమె భర్తను విచారించగా బీటెక్ చదివిన జ్యోతిక ఉద్యోగం చేస్తానని అడగడంతో నిరాకరించానని, దీంతో ఆత్మహత్యకు పాల్పడిందని వివరించారు. మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందజేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. శనివారం రాత్రి తిరుపతికి చేరుకున్న జ్యోతిక తల్లిదండ్రులు, బంధువులు ఆమె ఇంటికెళ్లి వివరాలు తెలుసుకుని వేకువజామున ఈస్ట్ పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. వరకట్నం కోసం వేధించడమే కాకుండా తమ కుమార్తెను హత్య చేశారంటూ భర్త, కుటుంబ సభ్యులపై హత్యకేసు నమోదు చేయాలని కోరారు. ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ పురుషోత్తంరెడ్డి వారితో చర్చించారు. వివాహ సమయంలో ధనరాజ్‌కు 10 తులాల బంగారు కట్నకానుకల కింద అందజేశామని, ఉద్యోగం లేకపోవడంతో పెళ్లైన ఆరు నెలల తర్వాత వ్యాపారం నిమిత్తం నాలుగు లక్షల రూపాయలు ఇవ్వాలని అడగడంతో ఇచ్చామని జ్యోతిక తండ్రి రామన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. మళ్లీ మరో ఐదు లక్షల రూపాయలు తీసుకురావాలని కొన్నాళ్లుగా తమ కుమార్తెను ధనరాజ్, ఆయన కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని, ఆ వేధింపులు తాళలేకే ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదు చేశారు. ఆ మేరకు భర్త ధనరాజ్, ఆయన తల్లిదండ్రులు, సోదరిపై 304బి. 398ఎ వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేశారు.

పవిత్ర మృతిపై వీడిన మిస్టరీ...!

పథకం ప్రకారమే హత్య ● నీటిలో ముంచి కడతేర్చిన భర్త

శ్రీకాళహస్తి, జనవరి 28: శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని స్వర్ణముఖి నదిలో అనుమానాస్పదంగా మృతిచెందిన పవిత్ర ఘటనలో మిస్టరీ వీడింది. వివరాల్లోకి వెళితే... వరదయ్యపాళెంకు చెందిన లారీ డ్రైవర్ శ్రీనివాసులు(55), భార్య పవిత్ర (36) తలపై దాడి చేసి గాయపరిచాడు. తిరుపతిలో చికిత్స పొంది 13రోజుల తర్వాత ఆమె డిశ్చార్జ్ అయింది. ముక్కంటి ఆలయం దర్శించుకుని ఇంటికి వెళదామంటూ ఈ నెల 26వ తేదీ శ్రీనివాసులు భార్యను శ్రీకాళ హస్తికి తీసుకొచ్చాడు. ఎలాగైనా భార్యను హతమార్చాలని పతకం వేశాడు. మాయ మాటలతో ఆలయం సమీపంలోని చిమ్మచీకట్లో నిర్మానుష్యంగా ఉండే స్వర్ణ ముఖి నదిలోకి తీసుకెళ్లాడు. నీటిలో ముంచి భార్యను హతమార్చినట్లు విశ్వసనీయ సమా చారం. ఆ తర్వాత ఆమెది సహజ మర ణంగా చిత్రీకరించేందుకు నీటిలో పడి భార్య చనిపోయిందంటూ నమ్మించే ప్రయత్నం చేశాడు. తొలి నుంచి అతడి ప్రవర్తన తెలిసిన కుటుంబ సభ్యులు మాత్రం శ్రీకాళహస్తి 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నరసింహారావు కేసు నమో దు చేశారు. మృతురాలి మెడపై గాయాలు ఉన్నట్లు పోస్టుమార్టం సమ యంలో వైద్యులు గుర్తించారు. దాని ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో భర్తే చంపేసినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు పక్కా సమాచారం. త్వరలో అరెస్టు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నారు.

పీలేరు సభ విజయవంతం

● టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం ● సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు ●నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



పీలేరు టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్ రెడ్డి



మదనపల్లె టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న అధికార ప్రతినిధి ఆర్‌జేవెంకటేశ్

కలికిరి, జనవరి 28: పీలేరులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన శనివారం జరిగిన రా..కదలిరా బహిరంగ సభ అంచనాలకు మించి విజయవంతమైందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దీంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం పెల్లుబుకుతోందన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు నగరిపల్లెలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని కలిసి అనూహ్యరీతిలో సభ విజయవంతం కావడంపై పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా నల్లారి కిశోర్ మాట్లాడుతూ అన్ని మండలాల్లో పార్టీ నాయకులు సభకు జన సమీకరణ చేయడానికి ఎవరంతకు వారు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేశారని కితాబిచ్చారు. అన్ని మండలాల నుంచి వచ్చిన వారితో పీలేరులో జన ప్రభంజనం సృష్టించారని ప్రశంసించారు. పార్టీ అత్యంత భరోసాతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి పీలేరులో ప్రభంజనం సృష్టించడం ద్వారా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చినట్లు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యకర్తల కష్టం వెలకట్టలేనిదన్నారు. గతంలో చంద్రబాబు కలికిరిలో నిర్వహించిన రాజంపేట పార్లమెంటు సమీక్షా సమావేశాలు, మదనపల్లె మినీ మహానాడు, నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా పీలేరులో నిర్వహించిన బహిరంగ సభలు నియోజకవర్గం కార్యకర్తల నిబద్ధతను చాటి చెప్పాయన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు, అన్ని విభాగాల బాధ్యులు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో ఎన్నికల్లో పార్టీ ఘన విజయానికి పాటుపడాలని ఆయన సూచించారు. అదే విధంగా రాజంపేట పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్ల నాయకులు కూడా సభను విజయవంతం చేయడానికి చేయూతనిచ్చారని వివరించారు.

వాల్మీకిపురంలో: పీలేరులో శనివారం జరిగిన రా.. కదలిరా సభను విజయవంతం చేసినందుకు వాల్మీకిపురం మండల టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలకు సభ విజయవంతం చేయడం పట్ల అభినందనలు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో ఇదే ఉత్సాహంతో ప్రతి కార్యకర్త గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు.

వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది

మదపనపల్లె టౌన్, జనవరి 28: పీలేరులో టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొన్న రా..కదలిరా కార్యక్రమం విజయవంతం కావడంతో వైసీపీ నాయకుల వెన్నులో ఓటమి భయం పట్టుకుందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుత ప్రాజెక్టులు, కనీసం కాలువలు కూడి నిర్మించలేని ముఖ్యమంత్రి జగన్ మూడు రాజధానులు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ఇంట్లో సొంత చెల్లికి, తల్లికి న్యాయం చేయలేని వ్యక్తి రాష్ట్ర ప్రజలకు ఏమి న్యాయం చేస్తారన్నారు.

చివరికి జగన్ చరిత్ర హీనుడుగా మిగిలి పోతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజన్న, ఆనంద్, రామచంద్రనాయుడు, గణేష్‌బాబు, జయరామ్ పాల్గొన్నారు.

ములకలచెరువులో: పీలేరులో జరిగిన టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రా..కదిలిరా భారీ బహిరంగ సభకు తరలివచ్చి విజయవంతం చేసిన తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ శ్రేణులకు తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ నేత జి.శంకర్‌యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి టీడీపీ కుటుంబ సభ్యులు భారీగా తరలివచ్చి విజయవంతం చేశారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలు ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. రాష్ట్రంలో అరాచక, అవినీతి పాలన సాగిస్తున్న వైసీపీని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబునాయుడు మరో సారి ముఖ్యమంత్రి కావాలన్నారు.

బి.కొత్తకోటలో: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పీలేరులో నిర్వహించిన రా... కదలిరా బహిరంగ సభకు తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి తరలి వచ్చిన కార్యకర్తలు, పార్టీ అభిమానులకు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు వెయ్యికి పైగా వాహనాలలో పార్టీ కోసం కార్యకర్తలు తరలి వచ్చారని, ఇదే ఊపును ఈ మూడు నెలలు కొనసాగిస్తే తంబళ్లపల్లెలో టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ప్రతి కార్యకర్త ఆయా బూత్‌ల పరిధిలో టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను, వైసీపీ అరాచకాలను ప్రజలకు వివరించాలన్నారు. త్వరలో గ్రామ గ్రామాన పర్యటించి తాను విస్తృత ప్రచారానికి శ్రీకారం చుడతానని అన్నారు.

పెద్దేరు ఉద్యానవనంలో అగ్నికి ఆహుతైన మొక్కలు



తంబళ్లపల్లె జనవరి 28 : తంబళ్లపల్లె మండలం కొటాల పంచాయతీ జుంజరపెంట వద్ద గల పెద్దేరు ఉద్యానవనంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో విలువైన మొక్కలతో పాటు నీటి సరఫరా కోసం వేసిన డ్రిప్పు పైపులు అగ్నికి ఆహుతి అయిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. సుమారు రెండు సంవత్సరాల క్రితం ఉపాధి హామీ నిధులతో సందర్శకులకు వినోదం అందించడానికి ప్రాజెక్టు వద్ద ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ఉద్యానవనంలో నిప్పు పెట్టడంతో పలు రకాల మొక్కలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఆదివారం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లిన గ్రామస్థులు అగ్నికి ఆహుతైన విలువైన మొక్కలను చూసి విచారం వ్యక్తం చేశారు. ఇకనైనా ఉద్యానవనంలో సంరక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులతో పాటు సంరక్షకులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి



మాజీ సర్పంచ్ రెడ్డెప్పరెడ్డి (ఫైల్)

ములకలచెరువు, జనవరి 28: రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ ఆర్.రెడ్డెప్పరెడ్డి(70) మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు...దేవళచెరువు పంచాయతీ ఆవులవారిపల్లెకు చెందిన ఆర్.రెడ్డెప్పరెడ్డి పని నిమిత్తం ద్విచక్రవాహనంలో వేపూరికోటకు వెళ్లి వస్తుండగా మార్గం మధ్యంలోని పర్తికోట వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మాజీ సర్పంచ్ తీవ్రంగా గాయపడడంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతి రుయాకు తరలిస్తుండగా మార్గం మధ్యంలో మృతి చెందాడు. మాజీ సర్పంచ్ మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహానికి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి ఆదివారం అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే ఏవీ లక్ష్మీదేవమ్మ, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ యువనేత, ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరిపల్లె జయచంద్రారెడ్డిలు వేర్వేరుగా గ్రామానికి చేరుకుని రెడ్డప్పరెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఇద్దరు నాటుసారా విక్రేతల అరెస్టు



అరెస్టు అయిన సారా విక్రేతలతో కలికిరి పోలీసులు

కలికిరి, జనవరి 28: కలికిరి పట్టణంలో నాటుసారా అమ్ముతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఏఎస్ఐ మధుసూదనాచారి, హెచ్‌సీ కొండప్ప ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నాటుసారా విక్రయిస్తున్న సమాచారంతో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పాత బస్టాండులో తులసి, ఇందిరమ్మ కాలనీలో గంగాధర్ సారా అమ్ముతుండగా పట్టుబడ్డారు. వారిద్దరి వద్ద నుంచి 15 లీటర్ల సారా సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. పట్టుబడ్డ ఇద్దరినీ రిమాండుకు పంపినట్లు ఏఎస్ఐ చెప్పారు. సారా అమ్ముతున్నవారు స్వచ్ఛందంగా అమ్మకాలు నిలిపివేయాలని లేదంటే కఠిన చర్యలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హెచ్‌సీలు కొండప్ప, మనోహర్, రాజేంద్ర, కానిస్టేబుళ్ళు వెంకటసిద్దులు, జిలానీ, దినేష్, మహిళా కానిస్టేబుల్ గాయత్రి పాల్గొన్నారు.

బెల్టు షాపుల జోరు.. ప్రజల బేజారు

గుర్రంకొండ, జనవరి 28:గుర్రంకొండ మండలంలోని పలు గ్రామాల్లో బెల్టు షాపులు జోరుగా సాగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా గుర్రంకొండ ఇందిరమ్మ కాలనీ, మార్కెట్ యార్డు, ఖండ్రిగ, మర్రిమాకులపల్లె, తరిగొండ, మర్రిపాడు, శెట్టివారిపల్లె, ఎల్లుట్ల, టి.పసలవాండ్లపల్లె, నడిమిఖండ్రిగ గ్రామాల్లో బెల్టు షాపులు అధికంగా ఉన్నట్లు ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా సాయంత్రం వేళ మందుబాబులు మహిళపట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని అడ్డుకుంటే అల్లర్లు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే పిల్లల పట్ల కూడా తాగుబోతులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారన్నారు. బెల్టు షాపులను తక్షణం అడ్డుకోవాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న జగన్

●జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు



బర్మావీధిలో ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత

మదనపల్లె, జనవరి 28: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన స్వలాభం కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని జనసేన నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు ఆరోపించారు. జనంకోసం జనసేన కార్యక్రమంలో భాగంగా 48వరోజు ఆదివారం పట్టణంలోని టౌన్‌బ్యాంకు సర్కిల్, బర్మావీధి, సీటీఎం రోడ్డు ఏరియాలలో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీరామ రామాంజనేయులు మాట్లాడుతూ పథకాల ప్రచారం పేరుతో సీఎం జగన్ తన ఫొటోలను బాగా పబ్లిసిటీ చేసుకుంటున్నారే తప్పా..ప్రజలకు ఒరిగిందేమీలేదని విమర్శించారు. వీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ప్రభుత్వానికి రోజువారి నడిపేందుకు, ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారిన నకిలీ మద్యాన్ని అమ్మకాలు చేపట్టి వారి ప్రాణాలను హరిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ద్వారా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు, ఆరోగ్యభద్రత కల్పించనున్నట్లు ఆయన వివరిస్తూ, ఈ రెండు పార్టీల మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, దారం హరిప్రసాద్, నాయని జగదీష్, రిటైర్డ్ రెవెన్యూ అధికారి గోపాల్, వీరమహిళలు రూప, పద్మావతి, ప్రభావతి, అశ్వత్, కుప్పాల శంకర్, ధరణి, సోను, సుప్రీం హర్ష, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె మల్లయ్యకొండకు మూడు ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, జనవరి 28:మదనపల్లె వన్‌డిపో నుంచి తంబళ్లపల్లె మల్లయ్యకొండకు మూడు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు ప్రతి సోమవారం మూడు ఆర్టీసీ బస్సులు నడిచే సమయాలను ఆయన వివరించారు. మదనపల్లె బస్టాండు నుంచి ఉదయం 5 గంటలకు, 6.30 గంటలకు, 7గంటలకు బస్సులు బయలుదేరుతాయని డీఎం చెప్పారు. ప్రయాణికులు, భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మల్లయ్యకొండకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడుపుతుండడంతో ప్రయాణికులకు సులభతరంతోపాటు ఆర్టీసీ ఆదాయం వస్తోందన్నారు.

జూనియర్లకు మార్గదర్శకులుగా నిలవాలి



పూర్వవిద్యార్థులతో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్

మదనపల్లె టౌన్, జనవరి 28: ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉద్యోగాల్లో స్థిరపడిన వారు జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం ఇదే కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత హోదాల్లో స్థిరపడ్డారన్నారు. వారందరు ఇక్కడికి చేరుకుని జూనియర్ విద్యార్థులతో కలసి ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు శివరామి రెడ్డి, సలీమా, అమరనాథ్, మధుసాయి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇంటింటి కార్యక్రమం

మదనపల్లె అర్బన్, జనవరి 28: కాంగ్రెస్‌పార్టీ నిర్వహించే ఘర్‌వాపసి కార్యక్రమంలో భాగంగా మండలంలోని పొన్నూటిపాళెం గ్రామంలో ఆదివారం కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గనాయకుడు రెడ్డీసాహెబ్ పార్టీ నాయకులతో కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్‌పార్టీలో అనేక పదవుల్లో పనిచేసివారిని గుర్తించి మళ్లి కాంగ్రెస్‌పార్టీలోకి ఆహ్వానించి తద్వారా కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో మండలఅధ్యక్షుడు సురేంద్రరెడ్డి, నియోజక వర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు సోమశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా నవచండీ హోమం

వాల్మీకిపురం, జనవరి 28: కోనేటివీధిలో వెలసిన లక్ష్మీకామేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం విశేష భక్తజనం నడుమ నవచండీ హోమం వైభవంగా సాగింది. ఉదయం ఆలయంలో కామేశ్వరస్వామికి పంచామృత, క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, విశేష అలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. శివకోటి పీఠం అప్పాస్వామి సమక్షంలో మహాపూర్ణహుతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కువైట్ శంకరాచారి, అర్చకులు గోనవరపు శీనాస్వామి, భక్తులు పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్‌ల వేతనాలు పెంచాలి



చంద్రబాబుతో ఇమ్మాదుల్లా

పీలేరు, జనవరి 28: అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని ఇమామ్‌లు, మౌజన్‌ల గౌరవవేతనాలను పెంచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్ బాషా, దూదేకుల సంఘం ఉపాధ్యక్షుడు ఇమ్మాదుల్లా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఇమామ్‌లకు ఇస్తున్న రూ.10 వేల స్థానంలో రూ.15 వేలు, మౌజన్‌లకు ఇస్తున్న రూ.5 వేల స్థానంలో రూ.10 వేలు చెల్లించాలని ఆయన కోరారు. ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలతో తమకొస్తున్న అరకొర వేతనాలతో ఇమామ్‌లు, మౌజన్‌లకు కష్టంగా ఉందని, గతంలో ఎవరూ పట్టించుకోని వారిని ప్రప్రథమంగా గౌరవ వేతనాలు కల్పించిన మీరే మరోమారు వాటిని పెంచాలని ఇమ్మాదుల్లా చంద్రబాబుకు అందించిన వినతి పత్రంలో కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గౌరవ వేతనాలను తప్పక పెంచుతామని చంద్రబాబు ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్లు ఇమ్మాదుల్లా తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాతో పగిలిన వ్యవసాయ పైపులు

●రాత్రి సమయాల్లో ఇసుక తవ్వకాలు

● వెంబడించి పట్టుకొన్న గ్రామస్థులు



పగిలిన వ్యవసాయ పైపుల కారణంగా వృథాగా పోతున్న నీరు

నిమ్మనపల్లి, జనవరి 28: ఇసుక అక్రమ రవాణాతో ఓ రైతు పొలంలోని వ్యవసాయ పైపులు పగిలిపోయి నీరంతా వృథాగాపోయింది. రాత్రి 12గంటల సమయంలో ఒక ఎక్స్‌కవేటర్, 7ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తుండడంతో గ్రామస్థులు వారిన వెంబడించి ఒక ట్రాక్టర్‌ను మాత్రమే పట్టుకోగా మిగిలిన వాహనాలు పారిపోమాయి. దీంతో ఆదివారం వ్యవసాయభూమి యజమాని సురేంద్రరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఆయన బాధిత రైతు మాట్లాడుతూ తవళం పంచాయతి చౌకిళ్లవారిపల్లికి చెందిన మనోహర్‌రెడ్డి కుమారుడు జగదీష్‌రెడ్డి అక్రమంగా ఇసుకను తరలించేందుకు ఒక ఎక్స్‌కవేటర్, 7ట్రాక్టర్లతో నిమ్మనపల్లి పంచాయతిలోని ఒడ్డు వద్ద ఇసుకను తవ్వేందుకు వెళ్లారు. అయితే అప్పటికే 30లోడ్ల ఇసుకను అక్రమంగా తరలించి తన ఇంటి వద్ద డంప్ చేసిపెట్టాడన్నారు. కాగా తన వ్యవసాయపొలంకు వేసిన పైపులను ఎక్స్‌కవేటర్‌తో తొలగించడంతో పైపులు పగిలి నీరు మొత్తం వృథాగా పోతుందని తెలిపారు. విషయం తెలుసుకొని వెళ్లగా అప్పటికే ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు అక్కడ నుంచి పరారయ్యాయి. అయినప్పటికి ఒక ట్రాక్టర్‌ను పట్టు కొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. కాగా ఇసుక అక్రమ రవాణా చేసిన జగదీష్‌రెడ్డితో పాటు ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో బాధిత రైతు పేర్కొన్నాడు. పట్టు బడ్డ ట్రాక్టర్ ముష్టూరు పంచాయతి వలసపల్లికి చెందిన నన్నేసాహెబ్‌గా గుర్తించి నన్నేసాహెబ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్ బాబు తెలిపారు.

మహల్ ఉరుసులో పాల్గొన్న కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, జనవరి 28: మండలంలోని మహల్‌లో ఆదివారం రాత్రి జరిగిన హజ్రత్ ఖ్వాజా సయ్యద్ యూసుఫ్ అలీ బాద్షా 175వ ఉరుసులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డితోపాటు ఆయన సతీమణి నల్లారి తనూజా రెడ్డితో కలిసి పాల్గొన్నారు. అనంతరం హాజరత్ సయ్యద్ దర్గాలో దంపతులిద్దరూ దువా నిర్వహించారు. మైసూరు గురు దువా సమర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, పల్లవోలు మాజీ సర్పంచు షాబుద్దీన్, సతీష్‌కుమార్ రెడ్డి, మత గురువు మహమ్మద్ సాహెబ్ పాల్గొన్నారు.

ఆశ్రీ సేవలు అభినందనీయం



వాల్మీకిపురంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రభుచరణ్

వాల్మీకిపురం, జనవరి 28: నిరుపేదల కోసం నిత్యం పరితపించే ఆశ్రీ సేవా సంస్థ సేవలు అభినందనీయం అని జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ పేర్కొన్నారు. ఆదివారం వాల్మీకిపురంలో సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకున్నంతలో సమాజంలోని పేదలకు సాయమందించడం ఆనందదాయకమన్నారు. భవిష్యత్తులో ఆశ్రీ సంస్థ అధినేత పూర్ణి రెడ్డి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి ఇక 74 రోజులే.. గడువు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు భవానిప్రసాద్

మదనపల్లె టౌన్, జనవరి 28: వైసీపీ ప్రభుత్వానికి కేవలం 74 రోజులు మాత్రమే గడువు ఉందని, జగన్‌కు ప్రజాకోర్టులో శిక్ష పడటం ఖాయమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు భవానిప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అన్నమయ్యసర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పట్టణ, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఎన్నికలకు తాము సిద్ధమని సీఎం జగన్ చెప్పడం చూస్తుంటే వారిని ప్రజలు కూడా ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపడం ఖాయమన్నారు. కురుక్షేత్ర ధర్మయుద్ధంలో టీడీపీ, జనసేన గెలుస్తాయని స్పష్టం చేశారు. ఐదేళ్లలో జగన్ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని, టీడీపీ అధికారంలోకి వస్తూనే అన్ని ప్రాజెక్టు లను పూర్తి చేస్తామన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు మాట్లాడు తూ వైసీపీ అరాచక పాలనలో టీడీపీ కార్యకర్తలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. వీటన్నింటికి బదులు తీర్చుకునే సమయం వచ్చిందని ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలే జగన్‌కు బుద్ధిచెబుతారన్నారు. ప్రధాన కార్యదర్శి కత్తి లక్ష్మన్న, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, రామకృష్ణ, వేణుగోపాల్, కాశీ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి తక్షణం స్థలం కేటాయించండి



సబ్‌కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేస్తున్న బహుజన సేన నాయకులు

మదనపల్లె టౌన్, జనవరి 28: చైతన్య సర్వీసెస్ అనాథ ఆశ్రమానికి ప్రభుత్వం తక్షణం స్థలం కేటాయించాలని చిన్నారులు వేడుకుంటున్నారు. ఆదివారం స్థానిక సబ్ కలెక్టరేట్ ఎదుట చైతన్య సర్వీసెస్ ఆశ్రమానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని బహుజన సేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన దీక్ష మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీచందు మాట్లాడుతూ తొమ్మి దేళ్లుగా అనాథాశ్రమం అద్దె భవనాల్లో నడుస్తోందని, వారికి స్థలం కేటాయించాలని వందల సార్లు అర్జీలు పెట్టుకున్నా అదిగో.. ఇదిగో.. అంటూ రెవిన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. చివరకు బీకేపల్లె రెవెన్యూ గ్రామంలోని ఓ స్థలం చూపించారని, అక్కడికి వెళితే కొందరు దౌర్జన్యం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆనంద్, రాఘవేంద్ర, చైతన్య, జయశంకర్, రూపక్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈఆర్‌సీ బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ

పీలేరు, జనవరి 28: ఆర్థిక ఆవశ్యకత, విద్యుత్ ఛార్జీల ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) సోమవారం నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుపనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ పీలేరు ఈఈ మునిచంద్ర తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఏపీఎస్పీడీసీఎల్ అందించిన ప్రతిపాదనలపై ఏపీఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమకున్న అభ్యంతరాలు, సలహాలు, సూచనలు అందజేయవచ్చునని ఆయన తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్, ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ అభిప్రాయసేకరణలో పాల్గొనే ఆసక్తి గల వారి కోసం పీలేరు-తిరుపతి మార్గంలోని తమ కార్యాలయంలో 29, 30, 31 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి 1 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. పీలేరుతో పాటు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామయ్యకు సొంత నిధులతో నెలనెలా పెన్షన్

●టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి వెల్లడి



బాధితుడికి పెన్షన్ అందిస్తున్న జయచంద్రారెడ్డి

పెద్దతిప్పసముద్రం జనవరి 28 : మండలంలోని పట్టెంవాండ్లపల్లె పంచాయతీ మొరుసుపల్లెకు చెందిన పెద్దపాళ్యెం రామయ్యకు ప్రతి నెలా సొంత నిధులతో రూ. 3వేలు పెన్షన్ ఇవ్వనున్నట్లు తంబళ్లపల్లె నియోజక వర్గ టీడీపీ నాయకుడు దాసరిపల్లె జయచంద్రారెడ్డి ప్రకటించారు. ఇటీవల తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి మొరుసుపల్లె గ్రామంలో పర్యటించిన సందర్భంగా గ్రామానికి చెందిన పెద్దపాళ్యెం రామయ్య అనే రైతు తమ గ్రామంలో ఏ అభివృద్ధి జరగడం లేదంటూ ఎమ్మెల్యేని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే రామయ్యకు వస్తున్న వృద్ధాప్య పెన్షన్‌ను ఆపేయాలంటూ వలంటీర్‌ను ఆదేశించడంతో పెన్షన్ ఆపేశారని స్థానిక నాయకులు జయచంద్రారెడ్డికి తెలిపారు. ఇందుకు స్పందించిన ఆయన ఆదివారం మొరుసుపల్లెకు చేరుకుని బాధితుడు రామయ్యతో మాట్లాడారు. రూ. 3వేలు చేతికి ఇచ్చి ఇకపై ప్రతి నెలా పింఛన్ తానే ఇస్తానని ప్రకటించారు. ప్రభుత్వ అభివృద్ధిని ప్రశ్నించినందుకు పెన్షన్ ఆపివే యడం దారుణమన్నారు. ఆయన వెంట మొరుసుపల్లె కృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రామచంద్ర, రమేష్‌రెడ్డి, ఆంజి, హరీష్, ఆంజనేయులు, పట్టా చంద్రమోహన్‌రెడ్డి, నవీన్ తదితరులు ఉన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లాప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె అర్బన్, జనవరి 28: కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆశా కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీ యూసీ జిల్లాప్రధాన కార్యదర్శి సాంబ శివ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ గర్భవతులకు, బాలింతలకు ప్రజలకు అనేక వైద్యసేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. కనీస వేతనం ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా కార్యకర్తల శ్రమను దోచుకుంటున్నారని ఆరోపించారు. నాలుగైదు వేలమంది ప్రజలు ఉన్న ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికపైనా ఆశా వర్కర్లను నియమించి పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆశాలకు కొత్తసెల్‌ఫోన్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మీ, ఏఐటీయూసీ నేతలు తిరుమల, కుమారి, కల్పన, రేఖా, విమల, రుక్మి ణీ,తదితరులు పాల్గొన్నారు.


మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



రైతులకు సూచనలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త

పీలేరు, జనవరి 28: మామిడిలో పూత, పిందె దశల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని కేవీకే శాస్త్రవేత్త బాలకృష్ణ సూచించారు. ఆదివారం తలపుల గ్రామంలో రైతులతో అవగాహనా సమావేశం నిర్వహించారు. కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నమయ్య రైతు సంఘం తరపున పలువురు రైతులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త బాలకృష్ణ మాట్లాడుతూ మామిడిలో తేనె మంచు పురుగు, పక్షి కన్ను, బూడిద తెగులు అధికంగా ఉన్నందున సస్య రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఆయా దశల్లో అవసరమైన సలహాలను శాస్త్రవేత్తల నుంచి పొందా లని కోరారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పీరూసాహెబ్, పీలేరు ఉద్యాన అధికారి సుకుమార్ రెడ్డి, అన్నమయ్య ఎఫ్‌పీవో ఛైర్మన్ జయప్ప నాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రాజంపేట పార్లమెంటు బీజేపీ కన్వీనర్‌గా రఘురామిరెడ్డి



పీలేరు, జనవరి 28: రాజంపేట పార్లమెంటు బీజేపీ కన్వీనర్‌గా పీలేరు నియోజకవర్గం కేవీపల్లె మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పాపిరెడ్డిగారి రఘురామిరెడ్డి నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఈ మేరకు శనివారం ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా, చిత్తూరు, నెల్లూరు జిల్లాల ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న ఆయనను పార్టీ అధిష్టానం రాజం పేట పార్లమెంటు కన్వీనర్‌గా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, దగ్గుబాటి పురందేశ్వరి ఆకాంక్షల మేరకు నడుచుకుంటూ రాజంపేట పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఆయనను పలువురు నాయకులు అభినందించారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు నేటి వరకు గడువు

పీలేరు, జనవరి 28: ఇంటర్ పరీక్షల కోసం తత్కాల్ స్కీమ్ కింద ఫీజులు చెల్లించేందుకు ప్రభుత్వం సోమవారం వరకు గడువు పొడిగించిందని జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘ అధ్యక్షుడు నాగసురేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మార్చిలో ఇంటర్ పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు రూ.3 వేల అపరాధ రుసుముతో సోమవారం ఫీజు చెల్లించవచ్చునని ఆయన తెలిపారు.